

8 పేజీలు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 04 డిసెంబర్ 2023 | www.navatelangana.com



పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్

ఏడు చోట్ల గెలుపు



- ప్రధాని మోడీ ప్రచారం చేసినా 10 చోట్ల బీజేపీ ఓటమి
- మూడు చోట్ల బీఎస్పీకి చెప్పుకోదగ్గ ఓటింగ్
- సంగారెడ్డిలో కాంగ్రెస్.. దుబ్బాకలో బీజేపీ సిట్టింగులు ఓటమి
- తగ్గిన హరీశ్‌రావు, కేసీఆర్ మెజార్టీ
- దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డికి భారీ మెజార్టీ
- మెదక్‌లో పద్మను ఓడించిన రోహిత్‌రావు
- పటాన్‌చెరు ఫలితంపై కాటా శ్రీనివాస్ అభ్యంతరం

మూడు చోట్ల గెలుపు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం బీఆర్ఎస్సే పైచేయి సాధించింది. పది స్థానాలకుగాను ఏడు చోట్ల విజయం సాధించి పట్టు నిలుపుకుంది. మూడు చోట్ల సిట్టింగ్ స్థానాల్ని చేజార్చుకున్న ఆ పార్టీ అదనంగా రెండు చోట్ల కాంగ్రెస్, బీజేపీ సిట్టింగ్ స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ మూడో చోట్ల గెలుపొంది ఏడు చోట్ల ఓటమిపాలైంది. ప్రధాని మోడీ ప్రచారం చేసినా బీజేపీ తన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోలేకపోగా పది స్థానాల్లోనూ ఓటమిపాలైంది. బీఎస్పీ మాత్రం మూడు చోట్ల చెప్పుకోదగిన ఓటింగ్‌ను సాధించింది. కేసీఆర్, హరీశ్‌రావుల మెజార్టీ తగ్గగా దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. మెదక్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిపై యువకుడు రోహిత్‌రావు విజయం సాధించగా సంగారెడ్డిలో సీనియర్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఓటమి చెందారు. రాత్రి వరకు కొనసాగిన పటాన్‌చెరు ఫలితంపై కాటా శ్రీనివాస్ అభ్యంతరం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భిన్నంగా వచ్చాయి. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీచింది. అత్యధిక స్థానాల్లో గెలిచిన ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం ఆ పార్టీ ఆశించిన స్థానాల్లో గెల్వలేకపోయింది. రాష్ట్రంలో రెండు పర్యాయాలు ప్రభుత్వంలో కొనసాగిన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం అత్యధిక స్థానాల్లో గెలిచి పట్టు నిలుపుకుంది. సిద్దిపేట జిల్లాలోని మూడు స్థానాల్లోనూ బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలిపొందింది. గజ్వేల్‌లో కేసీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావు, దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఆ మూడు స్థానాల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. మెదక్ జిల్లాలో నర్సాపూర్‌లో సునీతాలక్ష్మారెడ్డి మిగతా 2లో..

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	మెజార్టీ	పోలైన ఓట్లు
నారాయణఖేడ	84515	90281	5766	192472
అందోల్	85677	113104	27427	211344
మెదక్	76769	87126	10157	184920
జహీరాబాద్	96913	83620	13293	207763
పటాన్‌చెరు	105166	97738	7428	275893
సంగారెడ్డి	82614	73317	9297	184979
నర్సాపూర్	88104	78957	9147	196992
సిద్దిపేట	105514	23206	82308	178420
దుబ్బాక	97879	44366	53513	173370
గజ్వేల్	111684	66653	45031	231086

అందోల్ సెంటిమెంట్ రిపీట్



- ఈసారీ అందోలు గెలుపుతో రాష్ట్రంలో అధికారం
- కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చిన అవకాశం
- 56 ఏళ్లుగా చరిత్ర తిరగరాస్తున్న అందోల్

నవతెలంగాణ జోగిపేట

అందోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌పై 28,193 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ గెలుపొందిన పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. 1985 నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుతం అందోల్‌లో కాంగ్రెస్ జైత్రయాత్ర సాగించడంతో మరోసారి ఆ సెంటిమెంట్ నిజమైంది. అందోల్ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటు అయింది.

మిగతా 2లో..

అభివృద్ధికి పట్టం కట్టిన గజ్వేల్ ప్రజలు

- 45,283 ఓట్ల మెజార్టీతో కేసీఆర్ గెలుపు
- ప్రతి రౌండ్లో కేసీఆర్‌కు మెజార్టీ



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో పది సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు మాజీ సీఎం, సిట్టింగ్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను మూడోసారి గెలిపించారు. ముఖ్యమంత్రి హెూదాలో 9 సంవత్సరాలు గజ్వేల్ ఎమ్మెల్యేగా కొనసాగి అభివృద్ధి చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ రాకపోవడంతో ఆదివారం సాయంత్రం సీఎం పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. వెంటనే గవర్నర్ ఆమోదించడంతో మాజీ ముఖ్యమంత్రి అయ్యారు. గజ్వేల్ నియోజకవర్గంలోని 9 మండలాల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రతి రౌండ్లో మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించాలని మాజీ మంత్రి ఈటల రాజేందర్ బీజేపీ తరఫున పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి పోటీ చేశారు. మూడు పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేయగా చివరకు గజ్వేల్ ప్రజలు సిట్టింగ్ ఎమ్మెల్యే, మిగతా 2లో..

అభివృద్ధికి పట్టం కట్టిన గజ్వేల్ ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టం కట్టారు. రెండో స్థానంలో ఈటెల రాజేందర్, మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి ఉన్నారు. గజ్వేల్ అసెంబ్లీలో మొత్తం 2,74,654 ఓట్లు , 2,31,086 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కేసీఆర్‌కు 1,11,244 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 65,951 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నర్సారెడ్డికి 33,322 ఓట్లు వచ్చాయి. కేసీఆర్‌కు 45,283 ఓట్ల మెజార్టీ వచ్చింది. 41 మంది నోటకు ఓట్లు వేశారు.

అందోల్ సెంటిమెంట్ రిపీట్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు ఇక్కడ 16 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి.

1967 నుంచి సెంటిమెంట్ ఆనవాయితీ..

1967వ సంవత్సరంలో ప్రస్తుత ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ తండ్రి రాజనర్సింహ అందోల్‌లో గెలుపొంది హౌసింగ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1972, 1978 సంవత్సరాలలో కూడా ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రులుగా కాసు బ్రహ్మానందరెడ్డి, టి.అంజయ్య వ్యవహరించారు. 1985లో అందోల్ నుంచి మల్యాల రాజయ్య తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు పదవి చేపట్టారు. 1989లో దామోదర రాజనర్సింహ తొలిసారిగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి, నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎంలుగా వ్యవహరించారు. 1994లో మలిదఫా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మల్యాల రాజయ్య ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నారు. మల్యాల రాజయ్య ఆర్థిక, హౌసింగ్ మంత్రిగా పని చేశారు. 1998 ఉప ఎన్నికల్లో బాబు మోహన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నారు. 1999 జనరల్ ఎన్నికల్లో మళ్లీ టీడీపీ అభ్యర్థిగా బాబు మోహన్ గెలుపొంది కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. 2004, 2009లలో దామోదర రాజనర్సింహ అందోలు కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. పాఠశాల విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యాశాఖ మంత్రి, మార్కెటింగ్ శాఖ మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదవులు చేపట్టారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా బాబు మోహన్ పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ పదవి బాధ్యతలు చేపట్టారు. 2018లో ఎమ్మెల్యేగా టీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ గెలుపొందారు. రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారు. 2023 ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ విజయం సాధించడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనుంది. 56 ఏళ్లుగా అందోల్ ఈ సెంటిమెంట్‌ను తిరగరాస్తోంది.

కేసీఆర్‌కు ధ్రువీకరణ పత్రం అందజేత



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ అసెంబ్లీ శాసనసభ్యులుగా మాజీ సీఎం కేసీఆర్ విజయం సాధించిన వెంటనే ఇందూర్ కౌంటింగ్ కేంద్రంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఎమ్మెల్యే ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్ తరపున ధ్రువీకరణ పత్రాన్ని తీసుకున్నట్లు ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

హరీశ్‌రావు గెలుపు సర్టిఫికెట్ అందుకున్న మోహన్‌లాల్



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి తన్నీరు హరీశ్ రావుకు 1,05,514 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి పూజల హరికృష్ణపై 82,308 ఓట్ల మెజార్టీతో హరీశ్‌రావు విజయం సాధించారు. హరీశ్‌రావు ఎన్నికైన వెంటనే బీఆర్ఎస్ ఎన్నికల ఏజెంట్ మోహన్‌లాల్‌కు రిటర్నింగ్ అధికారి రమేష్‌బాబు ధ్రువీకరణ పత్రం అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ధ్రువీకరణ పత్రం అందుకున్నట్లు మోహన్‌లాల్ ప్రకటించారు.

పట్టు నిలపుకున్న బీఆర్ఎస్





(మొదటి పేజీ తరువాయి)

గెల్వగా మెదక్‌లో మైనంపల్లి రోహిత్‌రావు గెలిచారు. సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డిలో చింత ప్రభాకర్, జహీరాబాద్‌లో మాణిక్యరావు గెల్వగా పటాన్‌చెరులో గూడెం మహిపాల్‌రెడ్డి హ్యాట్రిట్ సాధించారు. అందోల్‌లో దామోదర రాజనర్సింహ, నారాయణఖేడ్‌లో పట్లోళ్ల సంజీవరెడ్డి విజయం సాధించారు. దీంతో బీఆర్ఎస్ ఏడు స్థానాలు, కాంగ్రెస్ మూడు స్థానాల్లో విజయం సాధించాయి.

పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్

సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరులో బీఆర్ఎస్ విజయ కేతం ఎగరేసింది. రాష్ట్రమంత బీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు వీచినా వాటిని తట్టుకుని ఏడు స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచింది. కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు మాణిక్యరావు, మహిపాల్‌రెడ్డిలు గెలుపొందారు. దుబ్బాకలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును ఓడించి 50 వేలకు పైగా మెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. జహీరాబాద్‌లో చంద్రశేఖర్ గెలుపుకు అడ్డుకట్ట వేసి మాణిక్యరావు 13454 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సంగారెడ్డిలో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ ఓడించారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి గెలుస్తారని అందరూ ఊహించారు. సీఎం రేసులో ఉన్న జగ్గారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో ఓటమిపాలయ్యారు. ఓడిపోయిన మూడు చోట్ల కూడా ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ నిలిచింది.

కాంగ్రెస్ మూడు స్థానాలకే పరిమితం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ మూడు స్థానాలకే పరిమితమైంది. ఏడు స్థానాల్లో ఓటమిపాలైంది. మెదక్‌లో మైనంపల్లి రోహిత్‌రావు తొలిసారి గెలుపొందారు. అందోల్‌లో దామోదర్ రాజనర్సింహ బీఆర్ఎస్ అభ్యర్థి చంటిక్రాంతి కిరణపై విజయం సాధించారు. నారాయణఖేడ్‌లో కూడా బీఆర్ఎస్‌పై సంజీవరెడ్డి గెలుపొందారు. సీఎం రేసులో ఉన్న జగ్గారెడ్డి ఓడిపోయారు. పటాన్‌చెరు, జహీరాబాద్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో ఓడిపోయింది.

మోడీ ప్రచారం చేసినా బీజేపీ ఓటమి

బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాని మోడీ ప్రచారం చేసినా ఒక్క చోట కూడా గెల్వలేకపోయింది. పైగా సిట్టింగ్ స్థానమైన దుబ్బాకలో రఘునందన్‌రావు ఘోరంగా ఓడిపోయారు. పార్టీలో కీలకమైన నాయకుడుగా ఉన్న ఈటెల రాజేందర్ గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ చేశారు. గజ్వేల్‌లో గెలుస్తామని చెప్పిన ఈటెల కూడా ఓడిపోయారు. పటాన్‌చెరులో నందీశ్వర్‌గౌడ్, సంగారెడ్డిలో పులిమామిడి రాజు, జహీరాబాద్ దామోదర రాంచద్రం, అందోల్‌లో బాబుమోహన్, నర్సాపూర్‌లో మురళీదర్ యాదవ్, మెదక్‌లో కూమార్ నామమాత్రం ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. ఎక్కడ కూడా గట్టి పోటీ ఇవ్వలేకపోయారు. దుబ్బాక, గజ్వేల్‌లో మాత్రమే ద్వితీయ స్థానంలో నిలిచారు.

బీఎస్పీకి మూడు చోట్ల మంచి ఓట్లు

పటాన్‌చెరులో బీఎస్పీ తరపున పోటీ చేసిన నీలం మధు మంచి ఓట్లు సాధించారు. గట్టి పోటీ ఇచ్చిన ఆయన 41 వేల ఓట్లు సాధించారు. జహీరాబాద్‌లోనూ ఝంగం గోపి కూడా 15 వేల వరకు ఓట్లు వచ్చాయి. సిద్దిపేటలో చక్రధర్ గౌడ్‌కు 16 వేల ఓట్లు వచ్చాయి. మిగతా చోట్ల వెయ్యి రెండు వేలకే పరిమితమయ్యారు. ఈ మూడు చోట్ల కూడా బీఎస్పీ పార్టీ పరంగా కాకుండా బీఆర్ఎస్ పనిచేసి టికెట్ రాకపోయే సరికి నీలం మధు బీఎస్పీలో చేరి పోటీ చేశారు. సిద్దిపేట చంద్రధరగౌడ్, జహీరాబాద్‌లో గోపి కూడా బీజేపీ పనిచేసి బయటికి వచ్చారు. వ్యక్తులకు ఉన్న పలుకుబడిని బట్టి ఓట్లు వచ్చాయి.

పటాన్‌చెరు ఫలితంపై కాటా పిర్యాదు

పటాన్‌చెరు ఫలితం ఆలస్యంగా ప్రకటించారు. 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరిగింది. 7 వేల ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి గెలిచినట్లు ప్రకటించారు. దీంతో కాటా శ్రీనివాస్ గౌడ్ కౌంటింగ్ సెంటర్‌లో అభ్యంతరం తెలిపారు. తన సొంత మండలమైన అమీన్‌పూర్‌లో తనకు తక్కువ లీడ్ ఎట్లా వచ్చిందని, ఓట్ల విషయంలో ఏదో తేడా జరిగిందంటూ అభ్యంతరం తెలిపారు. ఫైనల్ రిజల్ట్‌ను అధికారులు ప్రకటించి మహిపాల్‌రెడ్డి గెలిచినట్లు ఆర్వో దృవీకరించిన పత్రాన్ని అందజేశారు. దీంతో కాటా న్యాయ పోరాటం చేస్తానంటూ వెళ్లిపోయారు.

24 రౌండ్లలో కేసీఆర్‌కే ఆధిక్యం

- 10 రౌండ్లకే వెళ్లిపోయిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు
- గజ్వేల్ మార్గమధ్యంలోనే రాలిపోయిన పువ్వు
- డిపాజిట్ దక్కించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 321 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. మొత్తం 24 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. ప్రతి రౌండ్లో మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ సిట్టింగ్ ఎమ్మెల్యే కె.చంద్రశేఖరరావు మెజార్టీ పెరుగుతూ వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి, బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ రెండు మూడు స్థానాల్లో ఉన్నారు. మార్గమధ్యంలోనే బీజేపీ పువ్వులు రాలిపోయినట్లు రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. బిజెపి కాంగ్రెస్ ఏజెంట్లు 10 రౌండ్లు పూర్తి కాగానే కౌంటింగ్ హాల్ నుండి వెళ్లిపోయినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అప్పటికే కేసీఆర్‌కు 14 వేల మెజార్టీ వచ్చింది. 14 వేల మెజార్టీని కొట్టేసే గ్రామాలు బిజెపికి కాంగ్రెస్కు లేకపోవడంతో ఆశలు వదులుకొని కౌంటింగ్ హాల్ నుండి వెళ్లిపోయారు. కేసీఆర్‌ను ఓడిస్తానని బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ గజ్వేల్‌లో పోటీ చేసి ఓటమిని చవి చూశారు. ఇప్పటివరకు ఈటెల రాజేందర్ ఓటమి ఎరుగని నాయకుడిగా పేరు ఉండేది. కేసీఆర్ చేతిలో ఓటమి చవిచూడక తప్పలేదు. కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి కేసీఆర్ చేతిలో ఓటమి చెందడం.. మూడో స్థానంలో ఉండటం ఇది రెండోసారి. గజ్వేల్ అసెంబ్లీ ఓటర్స్ 2,74,654 ఉండగా నవంబర్ 30న జరిగిన పోలింగ్లో 2,31,654 మంది ఓటర్లు ఓటింగ్లో పాల్గొన్నారు. మొదటి రౌండులో కెసిఆర్ కు 3881 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ కు 3054, కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డికి 1217 ఓట్లు వచ్చాయి. రెండవ రౌండ్లో కెసిఆర్ కు 4582 ఓట్లు లాగా బిజెపి కి 3603, కాంగ్రెస్కు 2036 ఓట్లు వచ్చాయి. మూడో రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి.4782 ఓట్లు రాగా, బిజెపికి 3569, కాంగ్రెస్ 1627 ఓట్లు వచ్చాయి. నాలుగో రౌండ్లో బి ఆర్ ఎస్ కు5322, బిజెపి 2565, కాంగ్రెస్ 1370 ఓట్లు రావడం జరిగింది. ఐదో రౌండ్లో బి ఆర్ ఎస్ కు4712 ఓట్లు రాగా, బిజెపికి 3461, కాంగ్రెస్కు 1296 ఓట్లు వచ్చాయి. ఆరో రౌండులో బి ఆర్ ఎస్ పార్టీ కి4075, బిజెపి అభ్యర్థి 2251, కాంగ్రెస్ అభ్యర్థికి 1011 ఓట్లు పడ్డాయి. ఏడో రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి.4276, బిజెపికి 3362, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 888 ఓట్లు పడ్డాయి. ఎనిమిదో రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి.5066, బిజెపి 3118, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 889 ఓట్లు వచ్చాయి. తొమ్మిదో రౌండ్లో, బి ఆర్ ఎస్ పార్టీ కి.5765, బిజెపి 2929, కాంగ్రెస్కు 960 ఓట్లు పడ్డాయి. పదో రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి కెసిఆర్ కు 5306, బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ కు 2939, కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డికి 677 ఓట్లు పోలయ్యాయి. 11 రౌండ్లో, బి ఆర్ ఎస్ పార్టీ కి.4684, బిజెపి 2358, కాంగ్రెస్ 1739 ఓట్లు పోలయ్యాయి. 12 రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి.4064, బిజెపి 3083, కాంగ్రెస్ 1338 ఓట్లు వచ్చాయి. 13వ రౌండ్ లో బి ఆర్ ఎస్ పార్టీ కి.3978, బిజెపి 2611, కాంగ్రెస్ 2211 ఓట్లు వచ్చాయి. 14వ రౌండ్ లో బి ఆర్ ఎస్ 5087, బిజెపి 2825, కాంగ్రెస్ 2287 ఓట్లు వచ్చాయి. 15వ రౌండ్ లో బి ఆర్ ఎస్ పార్టీ కి.6031, బిజెపి 3258, కాంగ్రెస్ 1659, ఓట్లు పడ్డాయి. 16 రౌండ్ లో, బి ఆర్ ఎస్ పార్టీ కి 4685, బిజెపి 2544, కాంగ్రెస్ 1515, ఓట్లు పోలయ్యాయి. 17వ రౌండ్ లో బి ఆర్ ఎస్ పార్టీ కి 4557, బిజెపి 2499, కాంగ్రెస్ 1480 ఓట్లు వచ్చాయి. 18 రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి 5140, బిజెపి 3405, కాంగ్రెస్ 1750 ఓట్లు వచ్చాయి. 19 రౌండ్ లో బి ఆర్ ఎస్ పార్టీ కి 4372, బిజెపి 2853, కాంగ్రెస్ 1212 ఓట్లు వచ్చాయి. 20వ రౌండ్ లో బి ఆర్ ఎస్ పార్టీ కి 5274, బిజెపి 2549, కాంగ్రెస్ 962 ఓట్లు వచ్చాయి. 21 రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి 4714, బిజెపి 2658, కాంగ్రెస్ 1207 ఓట్లు వచ్చాయి. 22 రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి 5769, బిజెపికి 2277, కాంగ్రెస్ 1161 ఓట్లు పడ్డాయి. 23 రౌండ్లో. బి ఆర్ ఎస్ పార్టీ కి 4895, బిజెపి 2073, కాంగ్రెస్ 1851 ఓట్లు వచ్చాయి. 24 రౌండ్లో బి ఆర్ ఎస్ పార్టీ కి 226, బిజెపి 117, కాంగ్రెస్ 33 ఓట్లు పోలయ్యాయి. దీంతో మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ సిట్టింగ్ ఎమ్మెల్యే కెసిఆర్ కు 1,11,244 ఓట్లు రాగా, బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ కు 65,951 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డికి 33,322 ఓట్లు వచ్చాయి. దీంతో కెసిఆర్ 45 వేల 283 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇలా ప్రతి రౌండ్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు వరుసల నుండి విజయం సాధించారు.

మార్పుకోరిన ప్రజా తీర్పు

- ఓట్ల లెక్కింపులో హస్తం హవా
- రౌండ్ రౌండ్ కు ఉత్కంఠత
- మెదక్‌లో రోహిత్, నర్సాపూర్‌లో సునీత రెడ్డి గెలుపు

నవతెలంగాణ-మెదక్

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మెదక్ జిల్లాలో ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈవీఎం ఓట్ల లెక్కింపులో రౌండ్ రౌండ్‌కు వెలువడిన ఫలితాలు ప్రధాన పార్టీల అభ్యర్థులకు చెమటలు పట్టించాయి. ఎగ్జిట్ పోల్స్ సర్వేల ప్రకారం ప్రజలు మార్పు కోరుకున్నట్లు ముందు నుంచి అందరూ ఊహించిన విధంగానే ప్రజా తీర్పు వెలువడింది. ఆదివారం మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల పరిధిలోని వైపీఆర్ కళాశాలలో మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఐదంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా నడుమ జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా, పరిశీలకులు పృథ్వీ రాజ్, దేవేంద్ర ప్రతాప్ సింగ్ పర్యవేక్షణలో కౌంటింగ్ కొనసాగింది. ప్రతీ రౌండ్‌లోనూ హస్తం హవా చాటుకుంది. జిల్లాలో మొత్తం 4.40,341 లక్షల ఓటర్లు ఉండగా మెదక్ నియోజక వర్గంలో 2,16,748 ఓటర్లు, నర్సాపూర్ నియోజకవర్గంలో 2,23,593 ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో 86.69 శాతం పోలింగ్ నమోదు కాగా, మెదక్‌లో 85.31 శాతం, నర్సాపూర్‌లో 88.4 శాతం ఓట్లు పోలయ్యాయి. మెదక్‌లో 13 మంది అభ్యర్థులు, నర్సాపూర్‌లో 11 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.

మెదక్‌లో హస్తం హవా



మెదక్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు, ఎంఎస్ఎస్ఓ ఛైర్మెన్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ 26 ఏళ్ల వయస్సులో సంచలన విజయం సాధించారు. మెదక్‌పై మంత్రి హరీశ్‌రావు స్పెషల్ ఫోకస్ పెట్టినా ఫలితం లేకపోయింది. మెదక్ నియోజకవర్గంలో 1,84,920 ఓట్లను లెక్కించారు. ఇందులో1852 నోటాకు వేయగా 183068 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డికి 76,969 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు 87,126 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్‌కు 13,657 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో 2026 ఓట్లు ఉండగా 83 రిజెక్ట్ కాగా, నోటాకు 8 ఓట్లు పడ్డాయి. బీఆర్ఎస్‌కు 334, కాంగ్రెస్‌కు 1253, బీజేపీకి 305 ఓట్లు వచ్చాయి. మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డిపై 10,157 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు విజయం సాధించారు. మెదక్ ఎమ్మెల్యేగా రోహిత్ గెలుపొందినట్లు అధికారికంగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షి షా సంబంధిత గెలుపు నియామక పత్రాన్ని రోహిత్ తరపున వెంకటరమణకు అందజేశారు.

నర్సాపూర్ లో సునితమ్మకే జై కొట్టిన జనం



నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికే ఓటర్లు జై కొట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హెూరాహెూరీ పోటీ కొనసాగినప్పటికీ చివరి రౌండ్లలో బీఆర్ఎస్‌కు ఓట్లు పుంజుకోవడంతో సునీతా రెడ్డి గెలుపొందారు. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి 88,104 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి 78,957 ఓట్లు, బీజేపీ అభ్యర్థి మురళీ యాదవ్‌కు 22,713 ఓట్లు పోలయ్యాయి.

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వాకిట సునీతా లక్ష్మారెడ్డి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపై 9167 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. భారీ కాన్వాయ్‌లో విజయోత్సవ ర్యాలీగా వచ్చి గెలుపు నియామక పత్రాలను సునీత రెడ్డి అందుకున్నారు.

రౌండ్ రౌండ్ కు ఉత్కంఠ:



మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలకుగానూ14 టేబుల్స్, 20 రౌండ్స్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలకుగాను 14 టేబుల్స్, 22 రౌండ్స్‌లలో ఓట్లను లెక్కించారు. రౌండ్ రౌండ్‌కు ఉత్కంఠత నెలకొంది. ఉదయం 8 గంటల నుంచి 9:30 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. మెదక్‌లో పోస్టల్ బ్యాలెట్, మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి 6వ రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు అత్యధిక మెజారిటీ వచ్చింది. 7,8 రౌండ్లలో పద్మా దేవేందర్ రెడ్డికి స్వల్ప మెజారిటీ వచ్చినా, మళ్ళీ 9వ రౌండ్ నుంచి 15వ రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లో రోహిత్‌కు మెజార్టీ వచ్చింది. 16, 17వ రౌండ్‌లో పద్మా దేవేందర్ రెడ్డికి స్వల్ప మెజారిటీ వచ్చినా ఆ తరువాత రోహిత్‌కు ఓట్ల మెజారిటీ పుంజుకుంది. అదేవిదంగా నర్సాపూర్ నియోజకవర్గంకు సంబంధించి మొదటి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డికి ఓట్ల మెజారిటీ రాగా ఆ తరువాత 2 నుంచి 4, 7, 8 రౌండ్‌ల వరకు కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజీ రెడ్డికి వరుసగా మెజారిటీ వచ్చింది. 9 వ రౌండ్ నుంచి తిరిగి సునీత లక్ష్మారెడ్డికి మెజార్టీ రావడంతో ఓట్ల సంఖ్య పెరిగింది. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను, తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్ వంటి ఏర్పాట్లను చేశారు. మెదక్‌లో కాంగ్రెస్, నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందడంతో ఆయా పార్టీల నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, డ్యాన్సులు చేస్తూ స్వీట్లు పంచుకున్నారు.

ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-నార్సింగి



తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సర్వేలను నిజం చేశాయి. కేసీఆర్ ప్రభుత్వంపై ఏర్పడిన విముఖతను ఈ ఎన్నికల్లో స్పష్టం చేస్తూ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. ఎవరు ఊహించని విధంగా ప్రజలు తీర్పు చెప్పారు. దుబ్బాక నియోజక వర్గంలో సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో 50 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఎన్నికలకు ముందు కొత్త ప్రభాకర్ రెడ్డి కత్తి పోటుకు గురవడం, ప్రచారం లో పాల్గొనలేక పోవడం, ప్రజలలో పార్టీ పట్ల విముఖత అన్ని కలిపి బీజేపీ విజయం ఖాయం అనుకున్నప్పటికీ తీర్పు మాత్రం మరో విధంగా రావడం అందరి అంచనాలను తారు మారు చేసింది. ప్రభాకర్ రెడ్డి విజయం సాధించగా, అటు రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి పాలవడంతో బీఆర్ఎస్ నాయకులను ఏమీ తోచలేని స్థితికి నెట్టేసిందని చెప్పవచ్చు. నార్సింగి జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో కొత్త ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభాకర్ రెడ్డి విజయం ఖాయమని ముందే ఊహించామన్నారు. యాభై వేల పైచిలుకు మెజారిటీ ఇచ్చారని, మండల ప్రజలు సైతం మంచి మెజారిటీ అందించారన్నారు. ప్రజల తీర్పును శిరసా వహిస్తున్నామన్నారు.

బీఆర్ఎస్ సంబరాలు

నవతెలంగాణ-చేగుంట



దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి గెలవడంతో చేగుంట మండల కేంద్రంలో ఆదివారం సంబురాలు అంబరాన్ని అంటాయి. మండల కేంద్రమైన చేగుంటలోని గాంధీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. గాంధీ చౌరస్తా వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్తప్రభాకర్ రెడ్డి 53 వేల మెజారిటీతో గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెడుతూ జై కేటీఆర్, జై జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సంబురాల కార్యక్రమంలో టెలికాంబోర్డు సభ్యుడు సోమ సత్యనారాయణ, చేగుంట సొసైటీ డైరెక్టర్ సిద్ధిరాములు వైశ్య సంఘం నాయకుడు అయితా పరంజ్యోతి, కుర లక్ష్మీనారాయణ, జర్నల్ సింగ్, శ్రీనివాస్, రాజేష్, వెంకటేష్, నరేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పును కోరారు

నవతెలంగాణ-నార్సింగి



దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఓటమి, రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ విజయంపై మండల కాంగ్రెస్ నాయకులలో మిశ్రమ స్పందన కనిపించింది. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బాల్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొమ్మిది ఏళ్ళు అవినీతి పాలన సాగించిన బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కానుండడం మంచి పరిణామమని, రాష్ట్ర ప్రజలు మార్పును కోరారన్నారు. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యంతో గెలిపించినందుకు రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు హామీని నెరవేరుస్తామన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. దుబ్బాకలో ఓటమిపై స్పందిస్తు అక్రమంగా సంపాదించిన కోట్ల డబ్బును ఖర్చు చేసి కొనుక్కున్న విజయమని, ప్రజలను మభ్య పెట్టి గెలిచారన్నారు. న్యాయమైన గెలుపు కాదని కొట్టి పారేశారు. అయినాగానీ ప్రజా తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, తోడ్పాటు అందించిన ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఉత్సాహం.. బీఆర్ఎస్‌లో నిరుత్సాహం

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



రాష్ట్రంలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులకు నిరాశనే మిగిల్చింది. గత పది సంవత్సరాలు పాలన కొనసాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం జరిగిన ఎన్నికల్లో కేవలం 35 నుంచి 39 స్థానాలకే పరిమితం కావడంతో బీఆర్ఎస్ నాయకులు నిరుత్సాహంలో ఉండిపోయారు. కారు పోయినప్పటికి సారు మాత్రం గెలిచాడనే ఉత్సాహంతో ఉండిపోయారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడ లేని ఉత్సాహంతో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో విజయోత్సవ సంబరాలను చేపట్టారు. పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తూ స్వీట్లను పంచుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానికేతరులకు మాత్రం ఓటర్లు పట్టం కట్టలేకపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో కూడా పోటీలో నిలిచారు. కేసీఆర్ కామారెడ్డిలో స్థానికేతరుడు కావడంతో ఓటమి చెందినప్పటికీ స్వంత నియోజక వర్గం గజ్వేల్‌లో విజయం సాధించారు. గజ్వేల్‌లో బీజేపి నుంచి పోటీలో ఉన్న ఈటెల రాజెందర్ తన గ్రాఫ్‌తో కేసీఆర్‌ను ఢీకొట్టి గెలుస్తాడనే స్థాయిలో ప్రచారం జరిగినప్పటికి స్థానికేతరుడనే ఉద్దేశంతోనే ఈటెల రాజెందర్‌ను కూడా ఇక్కడి ప్రజలు ఓడించినట్టు తెలుస్తుంది. రాష్ట్రంలో ఒక్క సారిగా కాంగ్రెస్ పార్టీ 64 స్థానాలలో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ఉండడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిపోయింది. అదే ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో విజయోత్సవ సంబరాలను చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి రాష్ట్ర ప్రజలు రాష్ట్రాన్ని జన్మదినం సందర్భంగా బహుమతిగా ఇస్తున్నట్టు సోనియాగాంధీ రుణాన్ని తీర్చుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కుటుంబపాలనకు చరమగీతం పాడినట్టు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు సరైన మెజారిటీని ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల హృదయాలను గెలుచుకున్న ఆవుల రాజిరెడ్డి

నవతెలంగాణ-చిలిపిచేడ్



నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజిరెడ్డి ఎన్నికల్లో గెలవలేకపోయినప్పటికి నియోజకవర్గంలోని వేల మంది హృదయాలను గెలుచుకున్నారని మండలం సీనియర్ నాయకుడు తారా విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అధికార పార్టీకి చెందిన జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు ఒకపక్క ఉన్నా కాంగ్రెస్ పార్టీకి మధ్యతరగతి ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీకి అండగా నిలిచారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలు నిరుత్సాహానికి గురికావద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రేవంత్ సీఎం అవుతారని, ప్రజా సమస్యలు తీరుస్తారన్నారు. కార్యకర్తలు అధైర్య పడవద్దన్నారు.

మండలంలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



మెదక్ ఎమ్మెల్యేగా మైనంపల్లి రోహిత్ రావు విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుండడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో భారీ సంఖ్యలో కార్యకర్తలు నాయకులు అన్ని గ్రామాల నుంచి తరలివచ్చారు అనంతరం ఎన్నికల అధికారులు మైనంపల్లి రోహిత్ రావు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో నాయకులు కార్యకర్తలు బ్యాండ్ మేళాల మధ్య సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు సవిత శ్రీకాంత్, సుభాష్ ఎంపీటీసీ అర్చన శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మహేందర్ రెడ్డి, అక్బర్, సంజీవులు, అదిల్ పాషా, పద్మారావు పాల్గొనారు

సునీతా రెడ్డి విజయంతో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

నవతెలంగాణ-చిలిపిచేడ్



నర్సాపూర్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి గెలవడంతో ఆదివారం నాడు చిలిపిచెడు మండలంలో బీఆర్ఎస్ కార్యకర్తలు టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. జై కేసీఆర్ జై సునీతమ్మ అంటూ నినాదాలతో మండల కేంద్రాన్ని హెూరెత్తించారు. అనంతరం చిలిపిచేడ్ మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షురాలు లక్ష్మీ దుర్గా రెడ్డి మాట్లాడుతూ సునీత లక్ష్మారెడ్డి మచ్చలేని నాయకురాలని సునీత లక్ష్మారెడ్డిని గెలిపించిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

హుస్నాబాద్ 'హస్త'గతం

- ఉద్యమ నాయకుడు పొన్నంకే పట్టం
- పనిచేయని సతీష్ అన్న సౌమ్యత్వం
- కిందిస్థాయి నాయకుల వల్లే బీఆర్ఎస్ ఓటమి
- కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 1,00,995
- 19, 344 ఓట్ల మెజారిటీ
- ప్రజా సమస్యలు తెలుసుకుని సమర్థవంతంగా పనిచేస్తా
- సెంటిమెంట్ కేంద్రాన్ని అభివృద్ధి కేంద్రంగా మారుస్తా
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్







నవతెలంగాణ-అక్కన్నపేట, హుస్నాబా ద్‌రూరల్

ఉద్యమాల గడ్డ అంటే హుస్నాబాద్ అని చెప్పుకోవచ్చు. ఇప్పటికి హుస్నాబాద్ ప్రాంతంలో ఎర్రజెండాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది పోరాటాలు చేసిన చరిత్ర హుస్నాబాద్ నియోజకవర్గానికి ఉంది. అలాంటి హుస్నాబాద్ ప్రజలు పోరాట పటిమ కలిగిన అభ్యర్థులకే ఎప్పుడైనా పట్టం కట్టడం మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి హుస్నాబాద్‌లో 16వ సారి ఎమ్మెల్యేగా తెలంగాణ ఉద్యమ ముద్దుబిడ్డ పొన్నం ప్రభాకర్‌కే పట్టం కట్టారు. ప్రజలు కూడా వన్‌సైడ్‌గా ఆయనకు ఓట్లు వేసి గెలిపించారని చెప్పొచ్చు. హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు మండలాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, అక్కన్నపేట. నియోజకవర్గం ఏర్పడిన మొదటిసారి అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 2014లో ఒడితెల సతీష్ టీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2019లో రెండోసారి కూడా ఆయన గెలుపొందారు. ఈయన పిరియడ్‌లోనే 2021లో అక్కన్నపేట నూతన మండలంగా ఏర్పడింది. అలాంటి హుస్నాబాద్ నియోజకవర్గంలో 2023 ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ భారీ మెజారిటీతో గెలుపొందారు. పొన్నం ప్రభాకర్ గౌడ్ 1977 మే 8న పొన్నం సత్తయ్య, మల్లమ్మ దంపతులకు కరీంనగర్ జిల్లాలో జన్మించారు. ఈయన 2000 ఏప్రిల్ 21న మంజులను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు పృథ్వీ, ప్రణవ్. పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు పొందిన లీడర్. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు సైతం తెగించి కొట్లాడిన ఉద్యమ నాయకుడు. 2009 నుంచి 2014 వరకు 15వ లోక్‌సభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం కోసం ఆయన తన పదవికి రాజీనామా చేసి అధికార కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. చివరికి పెప్పర్స్ స్ప్రే దాడికి గురై ప్రాణాలు సైతం అడ్డుపెట్టి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడం కోసం ఎంతో కృషి చేశారు.

రాజకీయ ప్రస్థానం

1987-1988 మధ్యకాలంలో ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే రోజుల్లో విద్యార్థి నాయకుడిగా, యూనియన్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1987-1989 మధ్యకాలంలో ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 1987-1988 మధ్యకాలంలో కరీంనగర్ జిల్లా కళాశాలల కన్వీనర్‌గా పనిచేశారు. 1989-1991 మధ్యకాలంలో ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర కార్యదర్శి పదవిని, 1992-1998 మధ్యకాలంలో ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా అధ్యక్ష పదవి చేపట్టారు. 1999-2002 మధ్యకాలంలో ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2002-2003 మధ్యకాలంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ యొక్క ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2002-2004 మధ్యకాలంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా సెల్ సమన్వయకర్తగా పనిచేశారు. 2004-2009 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్, కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్ గా పనిచేశారు. 2009లో లోక్‌సభకు పోటీచేసే వరకు డి.సి.ఎం.ఎస్. అధ్యక్షుడుగా, మార్కుఫెడ్ విదేశాంగ ఛైర్మన్‌గా పని చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ తరపున 2009లో 15వ లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గం ఎం.పి.గా ఎన్నికయ్యారు. 2018 సెప్టెంబరులో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమయ్యారు. తెలంగాణ ప్రాంతం నుంచి 15వ లోక్‌సభలో అతి పిన్న వయసులో పార్లమెంటు సభ్యుడిగా మంచి గుర్తింపు పొందారు.



హుస్నాబాద్‌లో పొన్నం గెలుపు

ఈ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి పొన్నం ప్రభాకర్ 19,344 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. హుస్నాబాద్‌లో 242177 ఓటర్లు ఉండగా 205014 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్ కు 81291, 320 పోస్టల్ బ్యాలెట్ వచ్చాయి. బిజెపి అభ్యర్థి బొమ్మ శ్రీరామ్‌కు 8338, పొన్న ప్రభాకర్‌కు 99769 ఓట్లు రాగా 1186 పోస్టల్ బ్యాలెట్‌లతో 100955 ఓట్లు రాగా 19,344 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారని, తప్పకుండా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో పార్లమెంట్ సభ్యుడిగా అవకాశం ఇస్తే తెలంగాణ కోసం పోరాడిన, అదేవిధంగా హుస్నాబాద్ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తానని పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ హుస్నాబాద్ లో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామన్న హామీని నెరవేరుస్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. భూ నిర్వాసితులతో చర్చలు జరిపి న్యాయం చేస్తామన్నారు. నిరుద్యోగ ఉపాధి కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని సమర్థవంతంగా పని చేస్తానన్నారు. కెసిఆర్ ప్రజలను గొర్రెలు బర్రెలలా చూశాడని, అదే ప్రజలు పులులు సింహాలై కెసిఆర్ ను ఓడించారన్నారు. బిఆర్ఎస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలు, కెసిఆర్ ఒంటరి పోకూడలతో కాంగ్రెస్ పార్టీ విజయ సాధించిందన్నారు. ఉపాధ్యాయులకు 317 జీవో సవరిస్తామన్నారు.

విజయానికి కారణాలు

ఢిల్లీ స్థాయిలో ఉద్యమ నాయకుడు కావడం, ప్రత్యేకంగా బీసీ నేతగా మంచి గుర్తింపు సాధించారు. అంతేకాకుండా హుస్నాబాద్ నియోజకవర్గ సమస్యలపై అనునిత్యం పోరాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టారు.

సతీష్ కుమార్ ఓటమికి కారణం

హుస్నాబాద్ నియోజకవర్గంలో సతీష్ కుమార్ రెండు పర్యాయాలు గెలుపొంది సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పటివరకు ఆయనపై ఎలాంటి వివాదాలు లేవు. ఆయన కిందిస్థాయి నాయకులు విపరీతమైన అక్రమాలు చేయడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలమయ్యారు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

- బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు
- పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు
- బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

ఎన్నికల్లో తనపై నమ్మకంతో విశ్వాసంతో ఓటు వేసిన ప్రజలకు, అలాగే తనకోసం ఎన్నికల్లో పనిచేసిన కష్టపడిన కార్యకర్తలకు నాయకులకు ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటానని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. గడచిన పదేళ్లలో హుస్నాబాద్ శాసనసభ్యునిగా తనను ప్రజలు ఎంతో ఆదరించారని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రుల సహకారంతో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, కార్యకర్తలు ఎవరు నిరాశ చెందవద్దని, అధైర్య పడవద్దని కోరారు. ఇకముందు కూడా ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని తెలిపారు. తనకు సహకరించిన హుస్నాబాద్ ప్రజలకు అధికారులకు ప్రభుత్వ సిబ్బందికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలను కూడా కార్యకర్తలతో త్వరలో సమీక్షిస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందిన తన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు, అలాగే హుస్నాబాద్ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాబోయే ఐదేళ్లలో నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.

జనగామ పగ్గాలు పల్లాకే

- బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-చేర్యాల: ఆదివారం జరిగిన శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపొందడంతో చేర్యాల పట్టణ కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై 16418 మెజారిటీతో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు.

నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి ఘన విజయం

- 9,167 ఓట్ల మెజారిటీతో విజయం
- సంబరాలు చేసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి 9,167 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2 లక్షల 23 వేల 593 ఓట్లు ఉండగా ఇందులో 1 లక్ష 96 నేల 992 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి 88,104 ఓట్లు రాగా ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజురెడ్డికి 78 వేల 957 ఓట్లు వచ్చి రెండో స్థానంలో నిలిచారు. మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి మురళీధర్ యాదవ్‌కు 22 వేల 713 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపై 9,167 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు నర్సాపూర్ లో బాణాసంచాలు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకటో రౌండ్ నుంచి 15వ రౌండ్ వరకు ప్రతి రౌండ్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఆధిక్యం ప్రదర్శించారు. 16వ రౌండ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి 22వ రౌండ్ వరకు ఆధిక్యం ప్రదర్శించారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి 9167 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ ఘనవిజయం సాధించిన ఘనత సునీతారెడ్డికే దక్కింది. ఎన్నికల ప్రచారంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొనడం సునీతాడ్డికి విజయం సాధించి పెట్టినట్లు నాయకులు కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ నర్సాపూర్

నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతా లక్ష్మారెడ్డి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సాయంత్రం నర్సాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డిని, ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ఓపెన్ టాప్ జీప్‌పై ఎక్కించి టపాసులు కాలుస్తూ బ్యాండ్ బజంత్రీల మధ్య అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రధాన రోడ్డు గుండా విజయోత్సరాలి కొనసాగించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అశోక్ గౌడ్, బాబ్యానాయక్, మాచునూరి రాజు యాదవ్, సింగయపల్లి గోపి, పంబల్ల బిక్షపతి, నాగరాజుగౌడ్, సత్యం గౌడ్, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, నయీమొద్దీన్, గోవర్ధన్‌రెడ్డి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

- ఇందూర్ కళాశాల వద్ద మూడంచెల బందోబస్తు
- నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు









నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లాలోని 4 శాసన సభ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుండి కౌంటింగ్ ఏజెంట్లను, అభ్యర్థులను పోలీసులు వారికి ఇచ్చిన పాసులను పరిశీలించిన అనంతరమే లోపలికి అనుమతించారు. ఇందూర్ కళాశాల వద్ద పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తర్వాత ఈవీఎంలన్నింటినీ ఇక్కడికే తరలించి, స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. కౌంటింగ్ ఏజెంట్ల ముందే అధికారులు స్ట్రాంగ్ రూములను తెరచి ఈవీఎంలను కౌంటింగ్ హాల్లోకి తీసుకువచ్చారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన విశాలమైన 4 హాళ్లలో కౌంటింగ్ జరిగింది. ఒక హాల్‌లో ఒకేసారి 14 టేబుళ్ల మీద 14 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు చేశారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అధికారులు లెక్కించారు. అనంతరం రౌండ్లవారీగా ఈవీఎం లోని ఓట్లను లెక్కించారు. సిద్దిపేట నియోజకవర్గంలో 20 రౌండ్లు, దుబ్బాక నియోజకవర్గం లో 19 రౌండ్లో, గజ్వేల్ నియోజకవర్గం లో 23 రౌండ్లు, హుస్నాబాద్ నియోజకవర్గంలో 22 రౌండ్లలో ఓట్లు లెక్కింపు జరిగింది. మొదటి రౌండ్ 10 గంటల లోపే వెలువడగా, 19 రౌండ్ లు ఉన్న దుబ్బాక నియోజకవర్గం ఫలితం మొదటగా వెలువడింది. తర్వాత హుస్నాబాద్, సిద్దిపేట, చివరిగా 23 రౌండ్లో ఉన్న గజ్వేల్ ఫలితాలు వెలువడ్డాయి. దుబ్బాకలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి, హుస్నాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్, సిద్దిపేటలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హరీశ్‌రావు, గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ విజయం సాధించారు.

కలియతిరిగిన పొన్నం

హుస్నాబాద్ నుంచి బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ తాను గెలుస్తున్నానని నమ్మకంతోనే ఉదయం నుంచి కౌంటింగ్ సెంటర్ వద్దనే ఉన్నారు. మీడియా సెంటర్లో విలేకరులందరినీ కలుస్తూ కలియతిరిగారు. అక్కడనే విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఏడోసారి హరీశ్‌రావు ఘనవిజయం

- మొదటి రౌండ్ నుంచే కొనసాగిన లీడ్
- తగ్గిన మెజారిటీ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌రావు ఏడోసారి ప్రత్యర్థులపై ఘనవిజయం సాధించారు. గతం కంటే మెజార్టీ తగ్గినప్పటికీ ప్రతి రౌండ్‌లో మెజార్టీ పెంచుకుంటూ పోయారు. సిద్దిపేట నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల కోసం 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, బీఎస్పీ మధ్యనే ప్రధానంగా పోటీ జరిగింది. నియోజకవర్గంలో 2,33,733 ఓట్లు ఉండగా 1,78,420 ఓట్లు పోలయ్యాయి. హరీశ్‌రావుకు 1,04,109 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హరికృష్ణకు రెండో స్థానంలో 22,489 ఓట్లు వచ్చాయి, మూడో స్థానంలో బిజెపి అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి 22,332 ఓట్లు సాధించగా, నాలుగో స్థానంలో బీఎస్పీ అభ్యర్థి చక్రధర్ గౌడ్ 16,314 ఓట్లు సాధించారు. 20 రౌండ్లలో కలిపి మొత్తం హరీశ్‌రావు 81,620 ఓట్ల మెజార్టీని సాధించారు. వరుసగా ఏడోసారి హరీశ్‌రావు సిద్దిపేటపై బీఆర్ఎస్ జెండా ఎగరవేశారు. ఈసారి కూడా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు డిపాజిట్లు దక్కకపోవడం చెప్పుకోదగ్గ విషయం.

తగ్గిన మెజార్టీ..

హరీశ్‌రావు గత ఎన్నికలలో 1 లక్ష 18 వేల పైగా మెజార్టీ సాధించారు. ఈసారి 1.50 లక్షల మెజార్టీ లక్ష్యంగా బరిలోకి దిగారు. ఎక్కడ సమావేశం జరిగిన లక్ష యాభై వేల మెజార్టీ లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని చెబుతూ వచ్చారు. రెండోస్థాయి కార్యవర్గం ప్రజలతో సరిగ్గా ఉండకపోవడంతోనే, రెండో స్థాయి నాయకత్వంపై ఉన్న కోపంతోనే ఓటర్లు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపారని, అందుకే అనుకున్న మెజార్టీ సాధించలేకపోయాడని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు.. దళిత బంధు, బీసీ వృత్తిదారులకు సహకరించే పథకాలు అర్హులకు కాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు వచ్చాయని కోపం కూడా ప్రజలలో ఉన్నదని, అందుగురించే ఇతర అభ్యర్థులకు ఓట్లు వేశారని రాజకీయ నాయకులు చెబుతున్నారు.

ఆరు గ్యారెంటీలతో పేదల జీవితాల్లో వెలుగులు

- అసలైన తెలంగాణ నేడు ఆవిర్భవించింది
- దొరల పాలనను బొందపెట్టిన తెలంగాణ ప్రజలు
- దుబ్బాకలో కాంగ్రెస్ ఓడిపోవడం బాధాకరం
- శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారంతోనే దుబ్బాకలో ఓటమిపాలని ఆరోపణ



నవతెలంగాణ మిరుదొడ్డి / దుబ్బాక రూరల్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎన్నికలలో ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సేల్ జిల్లా ఉపాధ్యక్షుడు అందే రాజిరెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ గెలుపు పట్ల భూంపల్లి మండల కేంద్రంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధినాయకురాలు సోని యాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అట్టడుగు స్థాయి ప్రజలను చేరుకొని పార్టీకి ఎంతో ప్రజాదరణను పెంచాయని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే పార్టీగా దశాబ్దాల చరిత్ర కాంగ్రెస్ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదప్రజలకు అండగా నిలుస్తూ వచ్చిందని అట్టడుగు వర్గాల ప్రజల ఆదరణ ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఎంతో బలంగా మారిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత అధికారం కోల్పోయి ఎంతో నష్టపోయిన కాంగ్రెస్ పార్టీకి ఈ అసెంబ్లీ ఎన్నికలు సరికొత్త ఊపిరిని పోశాయని తెలిపారు. ఆదరించే ప్రజలను కాపాడే సమర్థవంతమైన నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఉందన్నారు. నేడు దొరల పాలనను బొందపెట్టిన తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్య తెలంగాణ గా ఆర్భమైందన్నారు . తెలంగాణ ప్రకటించింది డిసెంబర్ 9 నాడు అని తెలంగాణలో అధికారంలోకి 9 నాడే ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. ఓటమి చెందిన అంత మాత్రాన కార్యకర్తలు అధైర్యపడవద్దని చెరుకు శ్రీనివాస్ రెడ్డి అహంకారంతోనే దుబ్బాకలో ఓటమిపాలు కావడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ మావోయిస్టు జలంధర్ రెడ్డి , డిసిసి ప్రధాన కార్యదర్శి ఏలూరు కమలాకర్ , నాయకులు బోమ్మెర శ్రీదర్ , నాయకులు బోయిన పర్శరాములు, మహిపాల్ యాదవ్, బ్యాగరి నవీన్, మ్యాదరి కిషోర్, భాను, రాజు, ఉరెల్లి మహేష్, కోరెంద రవీందర్ రెడ్డి తదితరులున్నారు

ములుగు మండలంలో కాంగ్రెస్ సంబరాలు

నవతెలంగాణ-ములుగు

గడీల పాలనను బద్దలు కొట్టి కాంగ్రెస్ జెండాను ఎగరవేసిన రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలని ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపిటిసి తమల శ్రీనివాస్, మామిడాల సర్పంచ్ నాగరాణి శ్రీనివాస్ గౌడ్, కర్ణాకర్ గౌడ్, కోడిత్యాల ప్రభాకర్ అన్నారు. గత పది సంవత్సరాల నుండి అరాచక పాలనను కొనసాగిస్తున్న కెసిఆర్ ప్రభుత్వాన్ని కూల్ చేసి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చిన పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కొత్తకు 97,451 ఓట్లు
- ప్రత్యర్థి రఘునందన్‌రావుకు 43,744 ఓట్లు
- ప్రభాకర్‌రెడ్డికి 53,707 ఓట్ల మెజార్టీ లభ్యం





నవతెలంగాణ దుబ్బాక / దుబ్బాక రూరల్

దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. ఆదివారం నిర్వహించిన కౌంటింగ్‌లో కొత్త ప్రభాకర్‌రెడ్డికి 97,451 ఓట్లు, ప్రత్యర్థి రఘునందన్‌రావుకు 43,744 ఓట్లు పోలయ్యాయి. ప్రభాకర్‌రెడ్డికి 53,707 ఓట్ల మెజార్టీ లభించింది.

బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు

తెలంగాణ సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక అసెంబ్లీ ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రతిపక్షాలపై విజయం సాధించడంతో ఆదివారం దుబ్బాక పట్టణ కేంద్రంతో పాటు మండలంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. పట్టణం, మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కత్తి కార్తిక గౌడ్, మున్సిపల్ ఛైర్పర్సన్ గన్నే వనిత భూమి రెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

నవతెలంగాణ-నార్సింగి





రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దుబ్బాక నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై యాభై మూడు వేల పైచిలుకు ఆధిక్యంతో గెలువడం పట్ల బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పట్టణ కేంద్రం లోని ఎస్బిఐ బ్యాంక్ వద్ద గ్రామ రహదారిపై భారీ ఎత్తున బాణా సంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మండల పార్టీ మైనారిటీ ఉపాధ్యక్షుడు ఎండీ ఫరీద్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు జమీర్ ఆధ్వర్యంలో పట్టణంలోని మధ్య రంగం, 3, 4, 5వ వార్డులలో పటాకులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామన్నారు. ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ పాలన సాగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని కాంగ్రెస్ మరువ కూడదని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు భారీగా పాల్గొన్నారు.

కౌడిపల్లిలో బీఆర్ఎస్ సంబరాలు



నవతెలంగాణ- కౌడిపల్లి

నర్సాపూర్ బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి గెలుపొందడంతో మండల కేంద్రమైన కౌడిపల్లిలో ఆదివారం నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జాతీయ రహదారిపై టపాసులు పేల్చి మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సార రామ గౌడ్ మాట్లాడుతూ సునీత లక్ష్మారెడ్డి విజయానికి సహకరించిన నాయకులకు కార్యకర్తలకు మహిళా కార్యకర్తలకు యువకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

సునీత లక్ష్మారెడ్డికి ఘన స్వాగతం

నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సునీత లక్ష్మారెడ్డి మెదక్ వెళ్తుండగా కౌడిపల్లిలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డిలకు కూకట్లపల్లి సర్పంచ్ సుజాత కాంతారావు ఘనంగా స్వాగతం పలికారు. మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు భారీగా టపాసులు కాల్చి సునీత రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్ వైస్ ఎంపీపీ నవీన్ కుమార్ గుప్తా, మాజీ సిడిసి ఛైర్మన్ చిలుముల దుర్గారెడ్డి, పిఎసిఎస్ సొసైటీ వైస్ ఛైర్మన్ చిలుముల చిన్నం రెడ్డి, డైరెక్టర్ గాదె రాయగిరి, సర్పంచ్ నర్సింగరావు మాజీ సర్పంచ్ బోయిన్ వీరయ్య., సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రతాప్ గౌడ్, కిషోర్ గౌడ్,బాలకృష్ణ, జడ్చర్ల వెంకన్న, బట్టయ్య, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ధృవీకరణ పత్రం అందుకున్న కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో 53,707 ఓట్ల మెజార్టీతో కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొందారు. ఆదివారం ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని కొత్త ప్రభాకర్ రెడ్డి అందుకున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి వెంట బీఆర్ఎస్ మహిళ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్, సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి పంతులు, వెంకట నరసింహ రెడ్డి, రామవరం చంద్రశేఖర్ రెడ్డి, లచ్చపేట అంజనేయులు తదితరులు ఉన్నారు

బీఆర్ఎస్ అభ్యర్థుల విజయంతో సంబురాలు



నవతెలంగాణ-తొగుట : దుబ్బాక నియోజకవర్గంలో కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం హర్షణీయమని బీఆర్ఎస్ నాయకు లు తెలిపారు. కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా ఆదివారం మండలం లోని పెద్ద మసాన్ పల్లి గ్రామంలో టపాకాయ లు పేల్చారు. అనంతరం వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో సర్పంచ్ మెట్టు వరలక్ష్మి స్వామి,నాయకు లు కానక గౌడ్,పన్యాల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై హరీశ్‌రావు పైచేయి

- రౌండ్లవారీగా వివరాలు

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రతిపక్షాలపై ప్రతి రౌండ్లో హరీశ్‌రావు పైచేయి సాదిస్తూ తన మెజార్టీని పెంచుకుంటూ పోయారు. 1వ రౌండ్లో హరీష్ రావుకు 6924 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూజల హరికృష్ణకు 666 ఓట్లు వచ్చాయి, 6258 నుండి ఓట్ల లీడ్ ను సాధించారు. 2వ రౌండ్ లో హరీష్ రావుకు 5637 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హరికృష్ణకు 1364 కోట్లు రాగా రెండు రౌండ్ లు కలుపుకొని 10,531 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 3వ రౌండ్లో 6430 ఓట్లను హరీష్ సాధించగా హరికృష్ణకు 1219 ఓట్లు రాగా మూడు రౌండ్ లు కలుపుకొని 15742 ఓట్ల మెజార్టీని హరీష్ సాధించారు. 4వ రౌండ్లో 4731 లను హరీష్ సాధించగా, బి ఎస్ పి అభ్యర్థి చక్రధర్ గౌడ్ కు 1087 ఓట్లు రాగా హరీష్ రావుకు నాలుగు రౌండ్లలో కలుపుకొని 19,411 ఓట్ల మెజార్టీ వచ్చింది. 5వ రౌండ్లో 5734 ఓట్లు హరీష్ రావుకు రాగా బిజెపి అభ్యర్థి దూది శ్రీకాంత్ రెడ్డి కి 1652 ఓట్లు రాగా హరీష్ రావు 23,940 ఓట్ల మెజార్టీని సాధించారు. 6వ రౌండ్లో హరీష్ రావుకు 5718 ఓట్లు రాగా హరికృష్ణకు 1515 ఓట్లు వచ్చాయి, 28,143 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 7వ రౌండ్లో హరీష్ రావు 4910 ఓట్లు సాధించగా, శ్రీకాంత్ రెడ్డి 17 54 ఓట్లు సాధించారు, 31,651 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 8వ రౌండ్ లో హరీష్ రావు



5155 ఓట్లు సాధించగా, శ్రీకాంత్ రెడ్డి కి 1871 ఓట్లు రాగా, 34,935 ఓట్ల మెజార్టీని సాధించారు. 9వ రౌండ్లో 3681 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1891 కోట్లు దూది శ్రీకాంత్ రెడ్డి కి రాగా, 36,725 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 10వ రౌండ్లో 4565 ఓట్లు హరీష్ కు రాగా, 1358 ఓట్లు హరికృష్ణ సాధించగా 40,272 ఓట్ల మెజార్టీని హరీష్ సాధించారు. 11వ రౌండ్ లో 4713 ఓట్లు హరీష్ కు రాగా, శ్రీకాంత్ రెడ్డి కి 1834 ఓట్లు రాగా, 45,151 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 12వ రౌండ్లో 3986 ఓట్లు హరీష్ రావుకు రాగా, శ్రీకాంత్ రెడ్డి కి 1782 ఓట్లు రాగా, 45,355 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 13వ రౌండ్లో 5252 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1160 ఓట్లు శ్రీకాంత్ రెడ్డి కి వచ్చాయి, 49,447 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 14 వ రౌండ్లో 5784 ఓట్లు హరీష్ రావు సాధించగా, 1352 ఓట్లు హరికృష్ణ సాధించగా, 54,525 ఓట్ల మెజార్టీ హరీష్ రావు సాధించారు. 15వ రౌండ్ లో 5240 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1,666 ఓట్లు చక్రధర్ గౌడ్ కు రాగా, 58,902 ఓట్ల మెజార్టీ హరీష్ రావు సాధించారు. 16వ రౌండులో 5,193 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1702 ఓట్లు చక్రధర్ గౌడ్ కు రాగా, 63,437 ఓట్ల మెజార్టీ హరీష్ రావు సాధించారు. 17 వ రౌండ్ లో 5,827 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1189 ఓట్లు హరికృష్ణ కిరాగ, 68,641 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 18వ రౌండ్లో 5590 ఓట్లు హరీష్ రావుకు రాగా, 1357 ఓట్లు చక్రధర్ గౌడ్ కు రాగా, 73,755 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. 19వ రౌండ్ లో 5102 ఓట్ల హరీష్ రావుకు రాగా, 1756 ఓట్లు హరికృష్ణకు రాగా, 78,108 ఓట్ల మెజార్టీని హరీష్ రావు సాధించారు. చివరి 20వ రౌండ్ లో 3937 ఓట్లు హరీష్ రావుకు రాగా, 648 ఓటు హరికృష్ణకు రాగా, 81,620 ఓట్ల మెజార్టీ హరీష్ రావుకు వచ్చింది. గతం కంటే తక్కువగానే హరీష్ రావుకు మెజార్టీ వచ్చింది.



ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయం మొదటి వార్షికోత్సవ మహెూత్సవాన్నికి నిర్వహకులు ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి పోచమ్మ బోనాలతో ప్రారంభమై సోమవారం ఉదయం పుట్టమన్ను తేవటం, గంగా తెప్ప తీసుకు ఓరావడం జరుగతుందని తెలిపారు. మంగళవారం ఉదయం ఐరెన్లు తేవడం, అమ్మవారి కల్యాణం, పంచరంగుల, పట్నాలు , అమ్మవారికి బోనాలు తేవడం, బుధవారం అమ్మవారికి తొట్టెల ఊరేగింపు జరుతుందన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

ఆపద్బాంధవులకు నేషనల్ సేవియర్ అవార్డు

నవతెలంగాణ - చిన్నకోడూరు

అత్యవసర సమయంలో వైద్య సహాయం కోసం 108కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మేమున్నామంటూ ప్రాణాలను రక్షించే ఆపద్బాంధవులు 108 సిబ్బంది. ఎంతటి విపత్కర పరిస్థితుల్లో అయిన తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడే 108 సిబ్బంది అందించిన సేవలను గుర్తించి నేషనల్ సేవియర్ అవార్డును అందించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏప్రిల్ 5న రంగనాయక సాగర్ లో పనులు చేసుకునే ప్రేమ్నాథ్ యాదవ్, కవితకుమారి దంపతుల కుమార్తె అయిన సుబ్బలక్ష్మి(23రోజులు) పాపకి స్నానం చేపిస్తున్న సమయంలో నీళ్లు మింగి అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు 108కి ఫోన్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి అశోక్, పైలట్ వెంకట్ లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న పసికందుకు సీపీఆర్ చేసి



ప్రాణాలను రక్షించారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి ప్రాణాలను రక్షించిన అశోక్, వెంకట్‌లకు నేషనల్ సేవియర్ అవార్డు ప్రకటించగా జీవీకే సంస్థ చైర్మన్ జీవీకే కృష్ణారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తాము అందించిన సేవలకు పాప ప్రాణాలు దక్కడం, సేవలను గుర్తించి అవార్డును ప్రకటించి అభినందించటం ఎంతో సంతోషంగా ఉందని అశోక్, వెంకట్ తెలిపారు.

ఈ విజయం మీకే అంకితం

- అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ దుబ్బాక/దుబ్బాక రూరల్

'కొంతమంది నాపై కుట్రలు చేసినా నన్ను మీ బిడ్డగా ఆదరించి అక్కున చేర్చుకున్నారు. ఆపత్కాలంలో అండగా నిలిచి నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. ఈ విజయం మీదే. ఇది దుబ్బాక ప్రజలకే అంకితం. అకుంటిత కార్యదీక్షతో నా విజయానికి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు, ఓటు వేసి ఆదరించిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు' అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లేకున్నా దుబ్బాక అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు.తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కును కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.తనకు ఇంతటి భారీ మెజార్టీని అందించిన దుబ్బాక ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడు అండగా ఉంటానని స్పష్టం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి,వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, భూంపల్లి మనోహర్ రావు, సోలిపేట సతీష్ రెడ్డి, కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, తీపిరెడ్డి మహేష్ రెడ్డి, కత్తి కార్తీకగౌడ్, రణం శ్రీనివాస్ గౌడ్, పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.





బీజేపీని ఓడించిన దుబ్బాక ఓటర్లకు అభినందనలు

- - సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్

నవతెలంగాణ దుబ్బాక/ దుబ్బాక రూరల్

దుబ్బాకలో మతతత్వ బీజేపీని ఓడించిన దుబ్బాక ఓటర్లకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ అభినందనలు తెలిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మతతత్వ బిజెపీ పార్టీని ఓడించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన దుబ్బాక నియోజకవర్గం ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బాకలో గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కంపెల్లి భాస్కర్, బత్తుల రాజు, మెరుగు రాజు, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడిన ప్రజలు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

పదేళ్ల కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని దళితబహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 4న చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దళిత బంధు పథకం అమలులో నిర్లక్ష్యం, వివక్ష పాటించారన్నారు. 2022-23 బడ్జెట్‌లో రూ.17,700 కోట్లను కేటాయించినప్పటికీ ఒక్క పైసా ఖర్చుపెట్టకుండా 2023-24 బడ్జెట్‌లో అంకెలను కాపిపెస్టు చేశారన్నారు. రూ.18 లక్షల ఎస్సీ కుటుంబాలలో 38 వేల కుటుంబాలకు మాత్రమే ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలక మండలి ఏర్పాటులో కాలయాపన చేయడంతో పాటు దళితులపై దాడులను అరికట్టడంలో విఫలం చెందారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై కేసీఆర్ తీవ్ర నిర్లక్ష్యం చేసి పేదలకు నాణ్యమైన కేజీ టు పీజీ విద్యను అందించలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు తప్పా కాంగ్రెస్‌పై నమ్మకంతో కాదన్నారు. జాగో తెలంగాణయాత్రకు సంఘీబావం పలికిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో దళిత ఉద్యోగుల సంఘం నేత పి.ఎల్లయ్య,డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి,డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు లు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం



నవతెలంగాణ-తొగుట

రాష్ట్రం అంతటా కాంగ్రెస్ ప్రభావం చూపినా దుబ్బాకలో మాత్రం బీఆర్ఎస్‌కే పట్టం కట్టారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తొగుటలో పార్టీ శ్రేణులతో కలిసి విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకలో 53707 ఓట్ల ఆధిక్యంతో కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం సాధించడం జరిగింద న్నారు. తొగు టలో సైతం 4225 ఓట్ల మెజారిటీ రావడం జరిగిం దన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌కు మరోసారి అధికారం ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. మెజారిటీ అందించిన మండల ఓటర్ల కు ధన్యవా దాలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రజల పక్షాన ఉంటామన్నారు. వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, రైతు బంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

పొన్నం విజయంతో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంతో పాటు మండలంలోని తంగళ్ళపల్లి, శ్రీరాములపల్లి, రాంచంద్రాపూర్‌లతో పాటు పలు గ్రామాలలో హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గెలుపొందడం పట్ల ఆదివారం కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పొన్నం తప్పక సహకరిస్తారని అలాగే ప్రభుత్వ పగ్గాలు కాంగ్రెస్ చేపట్టబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు గొరిట్యాల లక్ష్మన్, చింతకింది శంకర్, గూడ స్వామి, జయకృష్ణ, చుక్క అశోక్, పోలు శ్రీనివాస్, చుక్క శంకర్, రమేష్, సురేష్, తిరుపతి, కిరణ్, అవినాష్, దామోదర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి అండ



నవతెలంగాణ-జగదేవపూర్

పదో తరగతి స్నేహితుడికి అండగా నిలిచారు తోటి మిత్రులు. జగదేవపూర్ మండలంలోని మునిగడప గ్రామనికి కసాని వీరప్ప కొద్దీ రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మునిగడప ఉన్నత పాఠశాలలో 2004 పదవ తరగతి స్నేహితులు ఆదివారం వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబానికి రూ.42 వేల ఆర్థిక సహాయాన్ని భార్య భాగ్యకు అందజేశారు. స్నేహితుని కుటుంబానికి అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. బిజీ వెంకటాపూర్, మునిగడప, గోపాల్ పూర్, మాందపూర్, వట్టిపల్లి, బస్వాపూర్, చాట్లపల్లి, అంతయగూడ గ్రామాలకు చెందిన స్నేహితులు ఉన్నారు.

ఉత్కంఠ పోరులో చింతా జయకేతనం

కాంగ్రెస్ అభ్యర్థి జగారెడ్డిపై 9,297 ఓట్ల మెజార్టీతో చింతా ప్రభాకర్ గెలుపు..



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆద్యాంతం ఉత్కంఠ రేపిన సంగారెడ్డి నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో చివరికీ బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ జయకేతనం ఎగురవేశారు. గీతం యూనివర్సిటీలో ఆదివారం జరిగిన ఈ ఓట్ల లెక్కింపులో 9297 మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డిపై చింతా ప్రభాకర్ గెలుపొందారు. చింతా ప్రభాకర్ కు 82,614 ఓట్లు రాగా.. జగ్గారెడ్డికి 73,317 ఓట్లు వచ్చాయి. కాగా రౌండ్ రౌండ్‌కి ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు సాగింది. గత ఎన్నికల్లో చింతా ప్రభాకర్ ఓటమి పాలైనప్పటికీ.. నిత్యం ప్రజల మధ్యలో ఉండడం చింతాకు కలిసొచ్చింది. ఇప్పటివరకు చింతా ప్రభాకర్ 4 సార్లు పోటీలో నిలువగా రెండుసార్లు గెలుపొందారు. 2009 లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి జగ్గారెడ్డి పైన 29,522 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2018లో 2589 స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. మళ్లీ ఇప్పుడు 2023లో జగ్గారెడ్డి పైన 9,297 మెజార్టీతో గెలుపొందారు.

పద్మశాలి సంఘం హర్షం..

చింతా ప్రభాకర్ గెలుపు పట్ల జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి.. మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పెరి వెంకట హరికిషన్, ఉపాధ్యక్షులు నక్క రాఘవులు, యాగ్ని మురళి, కోశాధికారి పోల పుండ రీకం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుకొడపాక యాదగిరి, బల భద్ర విద్యాసాగర్, యువజన నాయకులు సోమ రమేష్, సంఘపురం రాజేంద్రప్రసాద్, పాలడుగు రాము, పాలడుగు నరేందర్, పాలడుగు పాండు, చీకోటి బాలకృష్ణయ్య రాజశేఖర్, పద్మ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో మాణిక్‌రావు ఘనవిజయం

కాంగ్రెస్ అభ్యర్థిపై చంద్రశేఖర్‌రావుపై 13,310 ఓట్ల మెజార్టీతో గెలుపు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ శాసనసభ్యుడిగా కొనింటి మాణిక్ రావు రెండోసారి ఘనవిజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో మాణిక్‌రావుకు 96913 ఓట్లు రాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆగం చంద్రశేఖర్‌రావుకు 83620 ఓట్లు వచ్చాయి. దాంతో 13,310 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై మాణిక్‌రావు గెలుపొందారు. కాగా జహీరాబాద్ నియోజ కవర్గంలో మాణిక్‌రావు మద్దతుదారులు విజయోత్సవ సంబురాలను జరిపారు. రంగులు చల్లుకుంటూ కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ పూల మాలలతో మాణిక్‌రావును సన్మానించారు.కార్యక్రమంలో టీఎస్ఐడీసీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నరోత్తం, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, మహా నాయకురాలు రమేష్ సరస్వతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



2 రౌండ్‌లు మినహా అన్నింటిలో ముందంజ..

5, 18వ రౌండ్‌లలో తప్ప మిగిలిన అన్నిం టిలో మాణిక్‌రావే స్పష్టమైన మెజార్టీతో ఆధిక్యత చాటారు. నిమ్జ్ ఉద్యమకారుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి చివరికి కాంగ్రెస్ పార్టీ అభ్యరికి మద్దతు ప్రకటించి నప్పటికీ.. ఆయనకు మద్దతుగా ఉన్న నిమ్జ్ భూ బాధి తులు మాత్రం అధికార పార్టీకే మొగ్గు చూపారు. చక్కర పరిశ్రమను ప్రారంభించాలని రైతులు చేసిన ఉద్య మానికి కాంగ్రెస్ అభ్యర్థి మద్దతు ప్రకటించినప్పటికీ.. రైతులు, కార్మికుల ఓట్లను రాబట్టలేకపోయాడని తెలుస్తోంది.

కొంప ముంచిన బయటి వ్యక్తుల ప్రచారం..

కాంగ్రెస్ అభ్యర్థి తాను జహీరాబాద్ ప్రాంతానికి చెందిన వాడినని చెప్పినప్పటికీ.. ఆయనకు మద్దతుగా జహీరాబాద్ నియోజక వర్గంలో పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ప్రచారం చేయడంతో స్థానికులు అయోమయంలో పడినట్టు తెలు స్తోంది. అలాగే గతంలో బీజేపీలో ఉన్నప్పుడు మైనార్టీ వర్గాలకు వ్యతిరేకంగా చేసిన ప్రసంగాలను అధికార బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి.. సఫలీకృతం అయ్యారు.

ఈ విజయం కార్యకర్తలదే : మాణిక్‌రావు



నేను భారీ మెజార్టీ గెలిచేందుకు కృషి చేసిన ప్రతీ కార్య కర్తకు ధన్యవా దాలు. నా విజయం కోసం పనిచేసిన కార్యకర్త రుణాన్ని వారికి సేవల ందించి తీర్చుకుంటాను. ఎవరికి ఏ సమస్య ఉన్నా.. నేరుగా నన్ను సంప్రదించండి. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

మాణిక్‌రావు మృధు స్వభావంతోనే గెలుపు..

ఎమ్మెల్యే మాణిక్‌రావు మృధు స్వభావమే ఆయన గెలుపునకు కారణమని పలువురు చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి వెళ్తూ అందరితో ఆయన కలుపుగోలుగా ఉండడం.. ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా వెళ్లడంతో.. మృధు స్వభావిగా ఆయన పేరుగాంచారు. ఆ పేరే ఇప్పుడు ఎన్నికల్లో విజయానికి దోహం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాకుండా.. టీఎస్ ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ నరోత్తం, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌లు మండలాల వారిగా ఓట్ మేనేజ్మెంట్‌ను విడదీసి ప్రతి ఓటర్ వద్దకు చేరేందుకు చేసిన కృషి ఫలించిందని స్పష్టం అవుతోంది.

ప్రజా తీర్పును స్వాగతిస్తున్నా..



నవతెలంగాణ-జోగిపేట

అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. 'రాజకీయాలల్లో గెలుపు, ఓటములు సహజమే. నా ఓటమికి గల కారణాలు, లోటు పాట్లపై సమీక్షించు కుంటా. ఈ అయిదేళ్లపాటు మీ సేవ చేసుకునే అదృష్టం కల్పించిన అందోల్ ప్రజలకు రుణపడి ఉంటాను. నాయకుడు అంటే అధికారంలోనే ఉండాల్సిన అవసరం లేదు. అభిమాన నేతగా.. నన్ను నమ్మి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు.. నమ్మి నాకు ఓటువేసిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు.'



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్ : ప్రజా తీర్పును గౌరవిస్తాం అని మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో తన కోసం కష్టపడ్డ కార్యకర్తలకు, నాయ కులకు, ప్రజాప్రతి నిధులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఓడినప్పటికీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని.. ప్రజా సమస్యల కోసం పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగారెడ్డి : సంగారెడ్డి ప్రజలు నాకు 5 ఏళ్ల విశ్రాంతి ఇచ్చారు.. వారి తీర్పును తప్పకుండా గౌరవిస్తాను అని జగ్గారెడ్డి అన్నారు. తనకు ఓట్లు వేసిన 65 వేల మందికి.. అలాగే ఓట్లు వేయని 71వేల మందికి కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి ప్రజలు తనకు కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మెన్‌గా అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే 2004,2009లో ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇచ్చారన్నారు. మీకు 24 గంటలుఅందుబాటులో ఉండే వారిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు.. ఇకపై ఆ ఎమ్మెల్యేతో అభివృద్ధి పనులు చేయించుకోండి అని అన్నారు. తాను హైదరాబాద్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు అమలు అయ్యేలా చూస్తానని.. అయినప్పటికీ అధికారులతో ఎప్పటికప్పుడు టచ లోనే ఉంటానన్నారు. తాను ఓడిపోయినా కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ చెప్పిన 6 గ్యారెంటీలను సంగారెడ్డిలో అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్‌కి అధికారం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్చెరు ఎమ్మెల్యేగా మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించిన గూడెం మహిపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రామచంద్రాపురం, భారతి నగర్ డివిజన్ లు, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సంబురాలు జరిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు పుష్ప, సింధు తెల్లాపూర్ మున్సిపాల్టీ చైర్మెన్ లలితా సోమిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాణా సంచాలను కాలుస్తూ మిఠాయిలను పంచుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ప్రజలు ఆదరించి మరోసారి గెలిపించారని సంతోషం వ్యక్తం చేశారు.



గుమ్మడిదల : పటాన్చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి గెలుపు పట్ల ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుమ్మ డిదల, దోమడుగు, అనంతారం, కానుకుంట బొంతపల్లి, వీరభద్ర స్వామి కమాన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం సంబురాలు జరిపారు. భారీగా టపాకాయలు కాల్చి మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మా ట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారన్నారు. దోమ డుగు గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి అమరుడు శ్రీకాంతా చారి అమరత్వం ఊరికే పోలేదని గుర్తు చేస్తూ.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు నక్క మంజుల వెంకటేష్ గౌడ్, సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, చిమ్ముల నరసింహారెడ్డి, దీపా నరేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అలేటి సంజీవరెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం : పటాన్చెరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి హట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన గూడెం మహిపాల్‌రెడ్డి గెలుపును పురస్కరించుకొని స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేశారు. బాణాసంచాలు కాల్చి, ఆటాపాటలతో నృత్యాలు చేశారు. మండల కేంద్రమైన జిన్నారంతో పాటు పెద్దమ్మ గూడెం, జంగంపేట, కిష్టయ్యపల్లితో పాటుగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈ సంబురాలు అంబరాన్నంటాయి.



ఝరాసంగం : జహీరాబాద్ నియోజకవర్గంలో రెండోసారి మాణిక్‌రావు గెలుపొందడంతో.. మండలంలోని మాచ్నూర్, మేదపల్లి తదితర గ్రామాల్లో గులాబీ శ్రేణులు సంబురాలు జరిపారు. అంతేకాకుండా బాణా సంచాలు కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, స్వామి దాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీలో ఆదివారం సురేష్ గురుస్వామి ఆధ్వర్యంలో చిట్టి నారాయణరావు కన్నెస్వామి నిర్వహించిన మహా పడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామికి అభిషేకం, నైవేద్యం, మహా పడిని వెలిగించి.. అయ్య ప్పస్వామి నామస్మరణ మారుమో గించారు. భజన బృందం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు, కాలనీ వాసులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వా ములు చిట్టి భుజంగ రావు, అనం త రావు, విజయ్ రెడ్డి, వెంకట్ రావు, పాల్గన రావు, వాసు, ధర్మాంరావు, కాంతా రావు తదితరులు పాల్గొన్నారు.

పట్లోళ్ల సంజీవరెడ్డి ఘన విజయం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి ఘన విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో 6766 మెజార్టీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డిపై గెలుపొందారు. సంజీవరెడ్డికి 90,281 రాగా, భూపాల్ రెడ్డికి 84,515 ఓట్లు దక్కాయి. సంజీవరెడ్డి విజయం పట్ల నారాయణఖేడ్ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. టపాకాయలతో పేలుస్తూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విజయానికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్జీఎఫ్ స్టేట్ గేమ్స్‌కు జిన్నారం విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-జిన్నారం

అండర్-17 ఎస్జీఎఫ్ స్టేట్‌మీట్‌కు జిన్నారం విద్యార్థులు ఎంపిక అయినట్టు జిన్నారం గిరిజన గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. గద్వాల్‌లో ఈనెల 5 నుంచి 8 వరకు జరిగే క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించే టీంకు తమ పాఠశాల విద్యార్థులు కె.ప్రతాప్, టి.జశ్వంత్‌లు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ స్కూల్ ఎంపిప ప్రయత్నం చేయాలని విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఆ విద్యార్థులకు గురుకులం సెక్రటరీ నవీన్ నికోలస్, స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, కోచ్ మహేష్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నవతెలంగాణ-వట్‌పల్లి

ఆందోల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ ఘన విజయం సాధించడంతో మండలంలో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచే రౌండ్ల వారీగా మెజార్టీ ఆధిపత్యంలో దూసుకుపోతుండడంతో కాంగ్రెస్ విజయం తథ్యమని భావించి.. అప్పటినుంచే డప్పు చప్పుళ్ళు, డీజే పాటలతో నృత్యాలు చేశారు. గెలుపు అనంతరం ఆనవాయితీ ప్రకారం మునిపల్లి మండలంలోని అంతారం దేవాలయంలో మొక్కులు చెల్లించి.. వట్‌పల్లిలోని వెంకట ఆశ్రమంలో గల దర్గాను దామోదర సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ స్పోర్ట్స్ చైర్మెన్, సీనియర్ న్యాయవాది మార్కెల్లి సంగమేశ్వర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ జోషి తదితరులు ఉన్నారు.



పుల్కల్ : ఆందోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజ నర్సింహ ఘన విజయం సాధించడం పట్ల పుల్కల్ ఉమ్మడి మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల అంబరాన్నంటేలా సంబురాలు జరిపారు. భారీ ఎత్తున బాణాసంచాలు కాలుస్తూ డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేశారు.



ఝరాసంగం : ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీ సాధించి.. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం సంబురాలు జరిపారు. ఒకరికొకరు మిఠాయిలు పంచుకుని బాణాసంచా కాల్చారు. కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ... పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగన్న, అసఫ్ అలీ, ల్యాఖత్ అలీ, సింగ్ పాల్గొన్నారు.

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-వెల్దుర్తి

ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ధర్మారం చివరస్తా వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దొంతి లక్ష్మాగౌడ్(50) తన సొంత పనుల మీద మెదక్ మండలంలోని పాతూరు గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి పయనమయ్యాడు. అదే సమయంలో పటాన్చెరుకు చెందిన సాకలి లింగం, సోని దంపతులు దామరంచ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని ధర్మారం చౌరస్తా వద్ద వారిద్దరి వాహనాలు ఎదురెదురుగా వచ్చి.. ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన లక్ష్మాగౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. లింగం, సోని దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. లక్ష్మా గౌడ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ వసూరు తెలిపారు. లక్ష్మాగౌడ్ సోదరుడు కుమారుడు శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'అందోల్'లో దామోదర గెలుపు

బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ పై 28,193 ఓట్ల మెజార్టీ..





నవతెలంగాణ-జోగిపేట

అందోల్ ఎమ్మెల్యేగా దామోదర రాజనర్సింహ ఘన విజయం సాధించారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో తన సమీప అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ పై 28,193 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. భార్య పద్మిని, కూతురు త్రిషలతో కలిసి వచ్చి గెలుపు నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఏ.శరత్, జిల్లా ఎస్పీ రూపేష్, రిటర్నింగ్ అధికారి పాండుల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

అందోల్ నియోజకవర్గంలో 2,49,248 ఓటర్లు ఉండగా.. 2,11,364 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో దామోదర్‌కు 1,14,147 ఓట్లు ఓట్లు రాగా, క్రాంతికిరణ్‌కు 85,954, బీజేపీ అభ్యర్థి బాబుమోహన్ కు 5524, బీఎస్పీ అభ్యర్థి ముప్పారం ప్రకాశానికి 762 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లోను కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. పోస్టల్ బ్యాలెట్‌లో 1455 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్‌కు 1043, బీఆర్ ఎస్‌కు 277, బీజేపీకి 62, బీఎస్పీకి 5 ఓట్లు వచ్చాయి. దామోదర్ విజయం సాధించినట్టు తెలుసుకొని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కౌంటింగ్ కేంద్ర వద్దకు చేరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మునిపల్లి మండలం అంతారంలోని విఠలేశ్వర స్వామిని దామోదర్ రాజనర్సింహ దర్శించుకున్నారు.

అందోల్‌లో నాలుగోసారి ఎమ్మెల్యేగా దామోదర

1989లో తండ్రి రాజా నరసింహ మరణానంతరం రాజకీయ రంగ ప్రవేశం చేసిన దామోదర్ రాజనర్సింహ.. టీడీపీ అభ్యర్థి మాల్యల రాజయ్యపై 3014 ఓట్ల మెజార్టీతో మొదటిసారి గెలుపొందారు. అనంతరం 1994, 1998, 1999లో వరుసగా మూడుసార్లు ఓటమి చెందారు. 2004లో 24,846 ఓట్ల మెజార్టీతో, 2009లో 2906 ఓట్ల మెజార్టీతో బాబు మోహన్‌పై దామోదర్ విజయాన్ని సాధించారు. 2014, 2018 ఎన్నికల్లో ఓటమి చెందగా, 2023లో మళ్లీ భారీ మెజార్టీతో గెలుపొందారు.

జోగిపేటలో సంబురాలు..

అందోల్ నియోజకవర్గంలో పాటు జోగిపేట పట్టణంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సంబరాలు జరిపారు. స్థానిక హనుమాన్ చౌరస్తా, బృందావన్ కాలనీ, ఆయా కూడళ్ల వద్ద బాణాసంచాలు కాల్చారు. పలువురికి స్వీట్లు తినిపించి నినాదాలు చేశారు.

సీఎం పదవి విషయంలో..

హై కమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ సీఎం పదవి విషయంలో హై కమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఉంటానని అందోల్ తాజా ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ విజయం.. తెలంగాణ ప్రజల విజయమని.. ప్రజల తీర్పుగా భావిస్తున్నామన్నారు. పదేండ్ల కుటుంబ పాలనకు తెలంగాణ సమాజం చరమగీతం పాడిందన్నారు. కార్యకర్తలు కష్టపడటం ప్రజలు గుర్తించడం వల్లనే ఈ విజయం సాధించా మన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు, మేలైన తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమం అభివృద్ధి పై దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఏ పార్టీ న్యాయం చేస్తుందో ప్రజలు ఆ పార్టీని నిలబెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామన్నారు.

పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలోని 5 నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం గీతం యూనివర్సిటీలో ప్రశాంతంగా జరిగిందని. అందుకు సుమారు 500 మంది కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టినట్టు జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా, నియోజకవర్గాల వారిగా వేరు వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేక బ్యారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అల్లర్లకు, గొడవలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అందుకు సహకరించిన సంగారెడ్డి జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



విఠలేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న దామోదర

నవతెలంగాణ-మునిపల్లి

అసెంబ్లీ ఎన్నికల్లో 28వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో అందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ కుటుంబ సమేతంగా మండలంలోని అంతారం జీవన్ముక్త విఠలేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అంతకుముందు బుదేరా చౌరస్తా నుంచి అంతారం గ్రామం వరకు టపాసులు పేలుస్తూ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట సతీమణి పద్మిని, కుమార్తె త్రిష దామోదర్, మాజీ ఎంపీపీలు రాంరెడ్డి, రాజేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీలు అసద్ పటేల్, అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్, ఎంపీటీసీ పాండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, మాజీ ఎంపీటీసీ మనోహర్, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీం, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

పాతికేళ్లకే ఎమ్మెల్యే..

మెదక్ గడ్డపై చరిత్ర సృష్టించిన డాక్టర్ మైనంపల్లి రోహిత్



పేరు : మైనంపల్లి రోహిత్
తండ్రి: హన్మంతరావు
తల్లి : వాణీ
జననం : 1997 నవంబర్ 1
స్వస్థలం : కొర్విపల్లి, మండలం చిన్నశంకరంపేట, జిల్లా మెదక్
విద్యార్హత : ఎంబీబీఎస్ (గైనకాలజి, పీడియాట్రిక్ గోల్డ్ మెడల్)

34 ఏండ్ల తరువాత కాంగ్రెస్ అభ్యర్థి విజయం

నవతెలంగాణ-మెదక్

మెదక్ నియోజకవర్గం నుంచి పాతికేళ్లకే ఎమ్మెల్యేగా గెలుపొంది డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చరిత్ర సృష్టించారు. మెదక్ అసెంబ్లీ స్థానంలో 34 ఏండ్ల తరువాత కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొంది.. అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడిగా, మైనంపల్లి సోషల్ సర్వీస్ చైర్మెన్‌గా పలు సేవా కార్యక్రమాలు చేసిన రోహిత్.. మెదక్ ప్రజల ఆదరణ, ఆత్మీయతను పొందారు. రాజకీయ నాయకుడు, సామాజిక సేవకుడు, వ్యాపారవేత్త, ట్రావెల్ ఇనం ఫ్లుయన్సర్, మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అనే సంస్థను ఏర్పాటుచేసి నియోజకవర్గంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో పేదలకు తన సంస్థ ద్వారా ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

34 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు..

మెదక్ నియోజకవర్గంలో మెదక్, హవేళిఘణాపూర్, చిన్నశంకరంపేట, పాపన్నపేట, రామాయంపేట, నిజాంపేట, నార్సింగిలోని కొన్ని గ్రామాలో ఉన్నాయి. 1952 నుంచి ఇప్పటి వరకు 17 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2014లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పద్మాదేవేందర్‌రెడ్డి తెలంగాణ తొలి మహిళా డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు జరిగిన 16 ఎన్నికల్లో 6 సార్లు తెలుగుదేశం పార్టీ, 5 సార్లు కాంగ్రెస్, రెండు సార్లు టీఆర్ఎస్, ఒక్కోసారి సీపీఐ, జనతా, స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఎన్నికతో కాంగ్రెస్ ఆరో సారి గెలుపొందింది. మెదక్ యోజకవర్గంలో ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరుగగా 6 సార్లు తెలుగుదేశం పార్టీ, 5 సార్లు కాంగ్రెస్, రెండు సార్లు టీఆర్ఎస్, ఒక్కోసారి సీపీఐ, జనతా, స్వతంత్ర అభ్యర్థులను గెలిచారు. 1952, 1957 లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకటేశ్వర్ రావు మొట్టమొదటి సారిగా తొలి రెండు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత 1967లో రామచంద్రారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 1978లో ఎస్. లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. చివరిగా 1989లో నారాయణరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. ఆ తరువాత ఇప్పటి వరకు కాంగ్రెస్ గెలిచిన పరిస్థితి లేదు. 34 ఏళ్ల తరువాత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్ రావు గెలుపొందడం విశేషం. మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారి డిప్యూటీ స్పీకర్ పదవిలో కొనసాగిన 25 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై 26 ఏళ్ల యువకుడు రోహిత్‌రావు 10,157 మెజారిటీతో గెలుపొందారు.

మానకొండూర్‌లో 'హస్తం' విజయదరహాసం

నవతెలంగాణ 9
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 04-12-2023 www.navatelangana.com

- అంబరాన్నంటిన విజయోత్సవ సంబురాలు
- పదేండ్ల తర్వాత పాగా వేసిన కాంగ్రెస్
- 31,743 ఓట్ల అధిక్యంతో కవ్వంపల్లి విజయం

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మానకొండూర్ నియోజకవర్గంలో ఆదివారం 'హస్తం' సునాయసంగా విజయదరహాసం ఎగురవేసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమీప బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌పై సుమారు 31,743 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2009లో ఆరెపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికవగా 2014, 2018 జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రసమయి బాలకిషన్ రెండు దపాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సుమారు పదేండ్ల




అనంతరం మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పాగా వేయడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహన్ని నింపింది. దీంతో మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆనందోత్సాహాలు చేసుకుంటు హర్షధ్వనాలు వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్ల గుండా భారీగా ర్యాలీ నిర్వహిస్తూ..బాణాసంచాలు, టపాసులు కాల్చుతూ..రంగులు చల్లుకుంటూ విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ విజయం సాధించడంపై మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకులు, సీపీఐ నాయకులతో కలిసి టపాసులు కాల్చుతూ విజయోత్సవ సంబురాలు నిర్వహించారు.

తన విజయం..ప్రజా విజయం

– ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



ఉత్కంఠ భరితంగా సాగిన మాన కొండూర్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో ప్రజలే విజయం సాధించారు. తన విజయం నియోజకవర్గ ప్రజల విజయం. కాంగ్రెస్ పార్టీని ఆదరించి భారీ మెజారిటీతో విజయ తీరాలకు చేర్చిన మానకొండూర్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞుడై ఉంటాను.

ఎమ్మెల్యే ఎన్నిక ధృవీకరణ పత్రం అందుకున్న పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

తెలంగాణ శాసనసభ ఎన్నికలలో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఎన్నికల ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

ప్రజా సేవే కొత్త ప్రభాకర్ రెడ్డి లక్ష్యం



నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు పట్ల మండలంలోని మిరుదొడ్డి, లింగుపల్లి, చెప్యాల, మల్లుపల్లి, అల్వాలతో పాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కొత్త ప్రభాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డిలు మాట్లాడుతూ ప్రజలలో ఉండి పేద ప్రజలకు సేవలు అందించే నాయకుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అని అన్నారు. దుబ్బాక అభివృద్ధి చెందడానికి కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి ఎంతో ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు, గ్రామాలలో మరింత అభివృద్ధి చేయడానికి కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తూ ప్రత్యేకంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, జెడ్పీటీసీ లక్ష్మీ లింగం, వల్లాల సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్ రెడ్డి, రాజ మహేందర్ రెడ్డి, సిద్ధి భారతి భూపతి గౌడ్ పోలీస్ రాజులు, సర్పంచ్ బాల్ నరసింహులు, మల్లేశం గౌడ్, గొల్ల రాములు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు





నవ తెలంగాణ – సిద్దిపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలో టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. స్థానిక రైతు బజారు నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల్ రెడ్డి, జంగిర్, చందు, కిరణ్, నజీర్, వెంకట్ రెడ్డి, వినోద్‌రెడ్డి, చంద్ర రెడ్డి, శ్రీనివాస్, బిజ్జం నరేష్, యువసేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ వద్ద సంబురాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత బస్టాండ్ వద్ద సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి , స్వీట్లు పంచుకొని కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. పార్టీ జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ , మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలను జరిపారు.

నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆదివారం టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ నాయకులు సత్తుగారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకున్నారని మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్ పథకంపై మొదటి సంతకం చేసిందని, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా రెండు లక్షల రుణమాఫీ పథకంపై మొదటి సంతకం చేస్తుందన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను తూచా తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన రాష్ట్ర ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొంగరి దయాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి పుట్ట బాలకృష్ణ, నాయకులు కృష్ణ యాదవ్, కొంగరి దయాకర్, పంబాల దేవరాజ్, మాసాన్ పల్లి కనకయ్య, మంతూరు యాదగిరి, శ్రీకాంత్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు విజయం సాధించడంతో మండల పరిధిలోని గ్రామాలలో కాంగ్రెస్ శ్రేణులు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం నిజాంపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాప్ నుంచి గ్రామంలోని వీధులలో ర్యాలీలు తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రజలందరు సంతోషంగా ఉన్నారన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారన్నారు. బీఆర్ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వాస్తవాలు గ్రహించి కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, మండల అధ్యక్షుడు మారుతి, పట్టణ అధ్యక్షుడు నసిరుద్దీన్, మధుసూదన్ రెడ్డి, యువజన అధ్యక్షుడు వినోద్, మోహన్ రెడ్డి, వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, జాల శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, కాకిరాజయ్య, చల్మేటి నరేందర్, భూమా గౌడ్, మహేష్, ధరావత్ విట్టల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం పట్ల హర్షం

నవతెలంగాణ-మిరుదొడ్డి



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం పట్ల సర్పంచ్ బాల నరసింహులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం లింగుపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టపాకాయలు కాల్చి బీఆర్ఎస్ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మనిషి ప్రజానాయకుడు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అని అన్నారు. ప్రజలు మంచి నాయకున్ని ఎంపికలో ఓటుతో మంచి నాయకున్ని ఎన్నుకోవడం సంతోషకరమన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కొత్త ప్రభాకర్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లింగుపల్లి గ్రామ నాయకులు రాజయ్య, చంద్రం, రవి, బాబు, స్వామి, రమేష్, బాల్ నర్సింలు, హరీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా సునితా రెడ్డి విజయం

సంబరాలు చేసుకున్న కార్యకర్తలు



నవతెలంగాణ-వెల్దుర్తి

నర్సాపూర్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి విజయంతో మండలంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత రెడ్డికి ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాల్లో 1081 లీడ్ లో ఉండగా, నర్సాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 9167 ఓట్లతో సునీత రెడ్డి విజయం సాధించారు. ఆదివారం ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలం వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. మొదటి సారి ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థికి గట్టి పోటీనిచ్చి నైతిక విజయం సాధించారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, 15 ఏళ్ళ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి ఆరవ సారి పోటీ చేసి ఎనిమిది వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

గౌరవంగా తప్పుకోవడం ప్రజాస్వామ్య గొప్పదనం

సామాజిక కార్యకర్త కె. శ్రీనివాసాచారి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్



ఎన్నికలలో ఓడిన వెంటనే శాంతియుతంగా, మర్యాదపూర్వకంగా అధికారం నుంచి తప్పుకోవడమనేది మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మన నేతలు ఆచరిస్తున్న అతి ముఖ్యమైన అంశమని సామాజిక కార్యకర్త శ్రీనివాస్ చారి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల అనంతరం రాష్ట్రంలో నెలకొన్న ముఖ్యమంత్రి రాజీనామాపై ఆయన స్పందిస్తూ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని దాదాపు పది సంవత్సరాలు ఏకఛత్రాధిపత్యంగా పరిపాలన చేసిన కేసీఆర్ ఎన్నికల ఫలితాలు ప్రకటించగానే శాంతియుతంగా, మర్యాదపూర్వకంగా తన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవడమనేది ఒక అద్భుతమైన సన్నివేశమన్నారు. అనేక దేశాల్లో ఎన్నికలు పూర్తయ్యాక పదవిని, అధికారాన్ని పట్టుకొని దిగిపోకుండా ప్రజలను గందరగోళపరిచే సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా అనేకం ఉన్నాయన్నారు. కానీ మన దేశంలో అధికార మార్పిడి రాష్ట్రాల స్థాయిల్లో, దేశ స్థాయిలో ఇంత సౌమ్యంగా, మృదువుగా జరిగిపోవడం ప్రపంచ దేశాలకు కూడా అర్థం కాని విషయమన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అధికార మార్పిడి విషయంలో వందకు వంద మార్కులను సంపాదించుకున్నది. అధికారంలో ఉన్నప్పుడు నేతలు ఎంత కర్కోటకంగా, అమానవీయంగా ప్రవర్తించినా ప్రజల ఓటు మద్దతును కూడగట్టుకోలేని పరిస్థితుల్లో తాము రాజీనామా చేసి ప్రజలు ఆమోదించిన వ్యక్తులను, పార్టీలను, ప్రజలను గౌరవించి అధికారాన్ని విడిచిపెట్టి ఇంటికి వెళ్లడం అసాధారణ విషయమని ఆయన కొనియాడారు. మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, మన నేతలు ఎంత లోపభూయిష్ట ప్రవర్తనను కలిగి ఉన్నా అధికార బదిలీ మాత్రం శాంతియుతంగా జరగడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రపంచంలో అనేక ప్రజాస్వామ్య దేశాలలో అధికార బదిలీ జరగడానికి యుద్ధాలు, హింస, ప్రజా జీవితం గందరగోళంలో పడడం మనం చూస్తూనే ఉన్నామని, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన అమెరికాలో సైతం డొనాల్డ్ ట్రంప్ అధికారం బదిలీ చేసే సమయంలో చాలా గందరగోళం సృష్టించారన్నారు. ఇలా అనేకమైన ఉదాహరణలు కూడా చెప్పుకోవచ్చు. ఏదేమైనా మన నేతలు భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఈ విషయంలో స్పష్టంగా పాటించడం మనందరికీ గర్వకారణమైన విషయమని శ్రీనివాస్ చారి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిని సన్మానించిన నాయకులు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పురం మహేశ్వర్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు యంజాల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాంజాల ప్రభాకర్ రెడ్డిలు ఆదివారం రాత్రి పోతారంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు ప్రజా సేవ అందించడంలో కొత్త ప్రభాకర్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. దుబ్బాక ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజలకు మరిన్ని సేవలు అందించి ప్రజల మనసును చూరగొనాలని వారు కోరారు.

గెలిచిన అభ్యర్థులు

నియోజకవర్గం	అభ్యర్థి	సమీప అభ్యర్థి	పోలైన ఓట్లు	వచ్చిన ఓట్లు	మెజార్టీ
1. సిర్పూర్	పాల్వాయి హరీష్‌బాబు	కోనేరు కోనప్ప		63043	3043
2. చెన్నూర్ (ఎస్సీ)	వివేక్ వెంకటస్వామి	బాల్క సుమన్		87541	37515
3. బెల్లంపల్లి (ఎస్సీ)	గడ్డం వినోద్	దుర్గం చిన్నయ్య		82217	36878
4. మంచిర్యాల	ప్రేమ్‌సాగర్‌రావు	రఘునాథ్‌రావు		105486	66116
5. ఆసిఫాబాద్ (ఎస్టీ)	కోవలక్ష్మి	శ్యామనాయక్		82,951	22832
6. ఖానాపూర్ (ఎస్టీ)	వెడ్మ బొజ్జు	జాన్సన్ నాయక్		53921	4289
7. ఆదిలాబాద్	పాయల్ శంకర్	జోగు రామన్న		66468	6147
8. బోథ్ (ఎస్టీ)	అనిల్ జాదవ్	సోయం బాపురావు		76297	23023
9. నిర్మల్	ఏలేటి మహేశ్వర్‌రెడ్డి	ఇంద్రకరణ్‌రెడ్డి		106400	50,703
10. ముధోల్	రామారావు పటేల్	విఠల్‌రెడ్డి		97501	15489
11. ఆర్మూర్	పైడి రాకేశ్‌రెడ్డి	పాట్వారి వినయ్‌రెడ్డి		72,658	29,669
12. బోధన్	పి.సుదర్శన్‌రెడ్డి	షకీల్ ఆమేర్		66,963	3,062
13. జుక్కల్ (ఎస్సీ)	తోట లక్ష్మీకాంతారావు	హన్మంత్‌షిండే		64,489	1,152
14. బాన్సువాడ	పోచారం శ్రీనివాస్‌రెడ్డి	ఏనుగు రవీందర్‌రెడ్డి		76,278	23,464
15. ఎల్లారెడ్డి	మదన్‌మోహన్‌రావు	జాజాల సురేందర్		86,989	24,001
16. కామారెడ్డి	వెంకటరమణారెడ్డి	కేసీఆర్		66,652	6,741
17. నిజామాబాద్ (అర్బన్)	ధనపాల్ సూర్యనారాయణగుప్త	షబ్బీర్‌అలీ	1,84,332	75,240	15,387
18. నిజామాబాద్ (రూరల్)	రేకులపల్లి భూపతిరెడ్డి	బాజిరెడ్డి గోవర్ధన్	1,95,018	78,378	21,963
19. బాల్కొండ	వేముల ప్రశాంత్‌రెడ్డి	ముత్యాల సునీల్‌కుమార్		70,417	4,553
20. కోరట్ల	డాక్టర్ కే.సంజయ్	ధర్మపురి అర్వింద్		72,115	10,305
21. జగిత్యాల్	డాక్టర్.సంజయ్	టీ.జీవన్‌రెడ్డి		70,243	15,822
22. ధర్మపురి (ఎస్సీ)	అడ్లూరిలక్ష్మణ్‌కుమార్	కొప్పుల ఈశ్వర్		91,393	22,039
23. రామగుండం	మక్కాన్‌సింగ్‌ఠాకూర్	కోరుకంటి చందర్		92,227	56,794
24.మంథని	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	పుట్టమధు		1,03,822	31,380
25. పెద్దపల్లె	విజయరమణరావు	దాసరి మనోహర్		1,18,888	55,108
26. కరీంనగర్	గంగుల కమలాకర్	బండిసంజయ్		90,438	3,169
27. చొప్పదండి (ఎస్సీ)	మేడిపల్లి సత్యం	సుంకెరవిశంకర్		90,395	37,439
28. వేములవాడ	ఆదిశ్రీనివాస్	లక్ష్మీనర్సింహరావు		71,451	14,581
29. సిరిసిల్లా	కేటీఆర్	కేకే మహేందర్‌రెడ్డి		89,244	29,687
30. మానకొండూరు	కే.సత్యనారాయణ	రసమయిబాలకిషన్		96,773	32,365
31. హుజురాబాద్	పాడికౌశిక్‌రెడ్డి	ఈటెల రాజేందర్		80,333	16,873
32. హుస్నాబాద్	పొన్నంప్రభాకర్	ఒడితెల సతీష్‌బాబు		1,00,955	19,344
33. సిద్దిపేట	టీ.హరీశ్‌రావు	పూజల హరికృష్ణ		1,04,109	81,620
34. మెదక్	మైనంపల్లి రోహిత్‌రావు	పద్మాదేవేందర్‌రెడ్డి		87,126	10,157
35. నారాయణఖేడ్	పట్లోళ్ల సంజీవరెడ్డి	మహారెడ్డి భూపాల్‌రెడ్డి		90,281	5,766
36. అంధోల్ (ఎస్సీ)	దామోదర రాజనర్సింహ	చంటి క్రాంతి		1,14,147	28,193
37. నర్సాపూర్	వి.సునీతారెడ్డి	ఆవుల రాజిరెడ్డి		88,410	8,855
38. జహీరాబాద్ ఎస్సీ	కె.మాణిక్యరావు	ఏ.చంద్రశేఖర్		96,913	13,310
39. సంగారెడ్డి	చింత ప్రభాకర్	జయప్రకాశ్‌రెడ్డి		82,614	9,297
40. పటాన్‌చెరు	గూడెం మహిపాల్‌రెడ్డి	కాటా శ్రీనివాస్		1,05,387	7,091
41. దుబ్బాక	కొత్త ప్రభాకర్‌రెడ్డి	రఘునందన్‌రావు		97,451	53,707
42. గజ్వేల్	కేసీఆర్	ఈటెల రాజేందర్		1,11,244	45,283
43. మేడ్చల్	మల్లారెడ్డి	వజ్రేష్ యాదవ్	6,37,838	1,86,017	33,419
44. మల్కాజిగిరి	మర్రి రాజశేఖరరెడ్డి	మైనంపల్లి హనుమంతురావు	4,88,807	1,25,049	49,530
45. కుత్బుల్లాపూర్	కేపీ వివేకానందా	కూన శ్రీశైలం గౌడ్	6,99,042	1,87,999	85,576
46. కూకట్‌పల్లి	మాధవరం కృష్ణారావు	బండి రమేష్	4,64,807	1,35,635	70,387
47. ఉప్పల్	బండారి లక్ష్మారెడ్డి	ఎం.పరమేశ్వర్‌రెడ్డి	5,29,396		49,030
48. ఇబ్రహీంపట్నం	మల్‌రెడ్డి రంగారెడ్డి	మంచిరెడ్డి కిషన్‌రెడ్డి	2,45,459	1,25,819	40,145
49. ఎల్‌బీ నగర్	డి.సుధీర్‌రెడ్డి	సామ రంగారెడ్డి		1,11,380	22,305
50. మహేశ్వరం	సబితా ఇంద్రారెడ్డి	శ్రీరాములు	3,02,762	99,391	26,158
51. రాజేంద్రనగర్	ప్రకాశ్‌గౌడ్	తోకల శ్రీనివాస్‌రెడ్డి	3,24,917	1,21,283	32,305
52. శేర్‌లింగంపల్లి	అరెకపూడి గాంధీ	జగదీశ్వర్‌గౌడ్	3,57,074	1,56,577	46,647
53. చేవెళ్ల (ఎస్సీ)	కాలే యాదయ్య	భీం భరత్	1,94,343	75,483	502
54. పరిగి	రామ్మోహన్‌రెడ్డి	మహేశ్‌రెడ్డి	2,01,468	98,536	24,022
55. వికారాబాద్ (ఎస్సీ)	ప్రసాద్‌కుమార్	మెతుకు ఆనంద్	1,74,296	86,478	12,672
56. తాండూర్	మనోహర్‌రెడ్డి	పైలెట్ రోహిత్‌రెడ్డి	1,73,754	84,662	6,543
57. ముషీరాబాద్	ముఠాగోపాల్	అంజన్‌కుమార్ యాదవ్	1,53,252	75,207	37,797
58. మలక్‌పేట్	అహ్మద్ మీన్ అబ్దుల్ బలాలా		6,37,838	1,86,017	33,419
59. అంబర్‌పేట్	కాలేరు వెంకటేశ్	కృష్ణయాదవ్	1,45,171	74,416	24,537
60. ఖైరతాబాద్	దానం నాగేందర్	విజయారెడ్డి	1,53,730	67,368	22,104
61.జూబ్లీహిల్స్	మాగంటి గోపినాథ్	మహమ్మద్ అజారుద్దీన్		80328	17,300
62.సనత్‌నగర్	తలసాని శ్రీనివాస్‌యాదవ్	మర్రి శశిధర్‌రెడ్డి	1,28,263	72,557	41,827
63. నాంపల్లి	మహ్మద్ మజిద్ హుస్సేన్		4,88,807	1,25,049	49,530
64. కార్వాన్	కేసర్ మొహిద్దీన్	అమర్‌సింగ్	1,75,865	83,388	83,388
65. గోషామాల్	రాజాసింగ్		5,29,396		49,030
66. చార్మినార్	మిర్ జుల్ఫీకర్ అలీ	మేఘరాణి అగర్వాల్	226117	89451	67025
67. చంద్రాయన్‌గుట్ట	అక్బరుద్దీన్ ఓవైసీ	సీతారామ్‌రెడ్డి	1,53,771	99776	81663
68. యాకుత్‌పుర	జాఫర్ హుస్సేన్		316666	36174	2130
69. బహదూర్‌పుర	మహ్మద్ ముబీన్	ఇనాయత్ అలీ	1,42,446	89,451	67,025
70. సికింద్రాబాద్	పద్మారావు		2,62,517	78,223	45,240
71 సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ)	లాస్య నందిత		1,24,064	58 911	17,164
72. కొడంగల్	రేవంత్‌రెడ్డి	నరేందర్‌రెడ్డి	1,93,940	1,07,429	32,532
73. నారాయణపేట్	పర్ణికారెడ్డి	రాజేందర్ రెడ్డి	1,81,708	84,005	7,950
74. మహబూబ్‌నగర్	శ్రీనివాస్ రెడ్డి	లక్ష్మారెడ్డి	178,069	87,227	18,738
75. జడ్చర్ల	అనిరుధ్‌రెడ్డి	లక్ష్మారెడ్డి	1,79,652	89,826	18,000
76. దేవరకద్ర	మధుసుధన్‌రెడ్డి	వెంకటేశ్వర్‌రెడ్డి	194,543	97,271	500
77. మక్తల్ (కాంగ్రెస్)	శ్రీహరి	చిట్టెం రామ్మోహన్‌రెడ్డి	178,069	74,914	17,525
78. వనపర్తి	మేఘారెడ్డి	నిరంజన్‌రెడ్డి	2,10,739	1,05,459	24,200
79. గద్వాల్	కృష్ణమోహన్‌రెడ్డి	సరిత	2,13,283	93,720	7,631
80. అలంపూర్ (ఎస్సీ)	విజేయుడు	సంపత్ కుమార్	1,96,307	1,06,660	27,173
81. నాగర్‌కర్నూల్	రాజేష్ రెడ్డి	మర్రి జనార్దన్‌రెడ్డి	1,83,098	86,479	5431
82. అచ్చంపేట్ (ఎస్సీ)	వంశీకృష్ణ	బాలరాజ్	1,93,765	1,15,337	49,676
83. కల్వకుర్తి	కసిరెడ్డి నారాయణరెడ్డి	తల్లోజు ఆచారి	2,01,285	75,508	5,089
84. షాద్‌నగర్	వీర్లపల్లి శంకర్	అంజయ్యయాదవ్	1,94,017	76,947	6,562

85. కొల్లాపూర్ (కాంగ్రెస్)

అభ్యర్థి : జూపల్లి కృష్ణారెడ్డి
సమీప అభ్యర్థి: హర్షవర్ధన్ రెడ్డి
పోలైన ఓట్లు : 1,90,669
వచ్చిన ఓట్లు : 91,853
మెజార్టీ : 28,981

86. దేవరకొండ (ఎస్టీ)(కాంగ్రెస్)

అభ్యర్థి : బాలునాయక్
సమీప అభ్యర్థి: రవీంద్రకుమార్
పోలైన ఓట్లు : 213881
వచ్చిన ఓట్లు : 111344
మెజార్టీ : 30021

87. నాగార్జునసాగర్ (కాంగ్రెస్)

అభ్యర్థి : జయవీర్‌రెడ్డి
సమీప అభ్యర్థి: నోముల భగత్
పోలైన ఓట్లు : 202,210
వచ్చిన ఓట్లు : 1,19,831
మెజార్టీ : 45849

88. మిర్యాలగూడ(కాంగ్రెస్)

అభ్యర్థి : బత్తుల లక్ష్మారెడ్డి
సమీప అభ్యర్థి: నల్లమోతు భాస్కరరావు
పోలైన ఓట్లు : 1,91,235
వచ్చిన ఓట్లు : 1.11963
మెజార్టీ : 48684

89. హుజూర్‌నగర్ (కాంగ్రెస్)

అభ్యర్థి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
సమీప అభ్యర్థి: శానంపూడి సైదిరెడ్డి
పోలైన ఓట్లు : 213702
వచ్చిన ఓట్లు : 116707
మెజార్టీ : 44888

90. కోదాడ (కాంగ్రెస్)

అభ్యర్థి : ఉత్తమ్ పద్మావతి
సమీప అభ్యర్థి: బొల్లం మల్లయ్యయాదవ్
పోలైన ఓట్లు : 206377
వచ్చిన ఓట్లు : 125783
మెజార్టీ : 58679

91.సూర్యాపేట్ (బీఆర్ఎస్)

అభ్యర్థి : జగదీశ్‌రెడ్డి
సమీప అభ్యర్థి: దామోదర్‌రెడ్డి
పోలైన ఓట్లు : 230564
వచ్చిన ఓట్లు : 75136
మెజార్టీ : 4605

92. నల్లగొండ (కాంగ్రెస్)

అభ్యర్థి : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
సమీప అభ్యర్థి: కంచర్ల భూపాల్‌రెడ్డి
పోలైన ఓట్లు : 204137
వచ్చిన ఓట్లు : 107405
మెజార్టీ : 54332

93. మునుగోడు (కాంగ్రెస్)

అభ్యర్థి : కె. రాజగోపాల్‌రెడ్డి
సమీప అభ్యర్థి: కె. ప్రభాకర్‌రెడ్డి
పోలైన ఓట్లు : 231197
వచ్చిన ఓట్లు : 118781
మెజార్టీ : 40138

94. భువనగిరి (కాంగ్రెస్)

అభ్యర్థి : కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
సమీప అభ్యర్థి: పైళ్ల శేఖర్‌రెడ్డి
పోలైన ఓట్లు : 196077
వచ్చిన ఓట్లు : 102744
మెజార్టీ : 26,202

95.నకిరేకల్ (కాంగ్రెస్)

అభ్యర్థి : వేముల వీరేశం
సమీప అభ్యర్థి: చిరుమర్తి లింగయ్య
పోలైన ఓట్లు : 201747
వచ్చిన ఓట్లు : 1,32,185
మెజార్టీ : 67,849

96. తుంగతుర్తి (ఎస్సీ)(కాంగ్రెస్)

అభ్యర్థి : మందుల సామేల్
సమీప అభ్యర్థి: గాదరి కిశోర్‌కుమార్
పోలైన ఓట్లు : 225237
వచ్చిన ఓట్లు : 129535
మెజార్టీ : 50194

97. ఆలేర్ (కాంగ్రెస్)

అభ్యర్థి : బీర్ల అయిలయ్య
సమీప అభ్యర్థి: గొంగిడిసునీత
పోలైన ఓట్లు : 212102
వచ్చిన ఓట్లు : 122140
మెజార్టీ : 49636

98. జనగాం

అభ్యర్థి : రాజేశ్వర్‌రెడ్డి
సమీప అభ్యర్థి : ప్రతాప్‌రెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 98,975
మెజార్టీ : 15,783

99. ఘన్‌పూర్ స్టేషన్ (ఎస్సీ)

అభ్యర్థి : కడియం శ్రీహరి
సమీప అభ్యర్థి : ఇందిర
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,01,696
మెజార్టీ : 7779

100. పాలకుర్తి

అభ్యర్థి : యశస్వినీరెడ్డి
సమీప అభ్యర్థి : దయాకర్‌రావు
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,24,234
మెజార్టీ : 47,149

101 డోర్నకల్ (ఎస్టీ)

అభ్యర్థి : రామచంద్రునాయక్
సమీప అభ్యర్థి : రెడ్యానాయక్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,15,587
మెజార్టీ : 53,131

102. మహబూబాబాద్ (ఎస్టీ)

అభ్యర్థి : మురళీనాయక్
సమీప అభ్యర్థి : శంకర్‌నాయక్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,16,644
మెజార్టీ : 50,172

103. నర్సంపేట్

అభ్యర్థి : మాధవరెడ్డి
సమీప అభ్యర్థి : సుదర్శన్‌రెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,04,185
మెజార్టీ : 1,4185

104. పర్కాల

అభ్యర్థి : ప్రకాశ్‌రెడ్డి
సమీప అభ్యర్థి : ధర్మారెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 72,573
మెజార్టీ : 7,941

105. వరంగల్ పశ్చిమ

అభ్యర్థి : కొండా సురేఖ
సమీప అభ్యర్థి : ప్రదీప్‌కుమార్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 66,725
మెజార్టీ : 15,040

106. వరంగల్ తూర్పు

అభ్యర్థి : రాజేందర్‌రెడ్డి
సమీప అభ్యర్థి : వినయ్‌భాస్కర్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 72,648
మెజార్టీ : 15,337

107. వర్ధన్నపేట్ (ఎస్సీ)

అభ్యర్థి : నాగరాజు
సమీప అభ్యర్థి : అరూరి రమేశ్
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,06,696
మెజార్టీ : 19458

108. భూపాలపల్లి

అభ్యర్థి : సత్యనారాయణరావు
సమీప అభ్యర్థి : వెంకటరమణారెడ్డి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,23,116
మెజార్టీ : 52,699

109.ములుగు (ఎస్టీ)

అభ్యర్థి : సీతక్క
సమీప అభ్యర్థి : నాగజ్యోతి
పోలైన ఓట్లు :
వచ్చిన ఓట్లు : 1,02,267
మెజార్టీ : 33,700

110. పినపాక (ఎస్టీ)

అభ్యర్థి : వెంకటేశ్వర్లు
సమీప అభ్యర్థి : కాంతారావు
పోలైన ఓట్లు : 158978
వచ్చిన ఓట్లు : 90510
మెజార్టీ : 34506

111. ఇల్లందు (ఎస్టీ)

అభ్యర్థి : కోరం కనకయ్య
సమీప అభ్యర్థి : బానోత్ హరిప్రియ
పోలైన ఓట్లు : 1,74,904
వచ్చిన ఓట్లు : 1,06,734
మెజార్టీ : 55,718

112. ఖమ్మం

అభ్యర్థి : టీ.నాగేశ్వరరావు
సమీప అభ్యర్థి : అజయ్‌కుమార్
పోలైన ఓట్లు : 23,6224
వచ్చిన ఓట్లు : 1,36,061
మెజార్టీ : 49,381

113. పాలేరు

అభ్యర్థి : పి. శ్రీనివాసరెడ్డి
సమీప అభ్యర్థి : ఉపేందర్ రెడ్డి
పోలైన ఓట్లు : 2,15,969
వచ్చిన ఓట్లు : 12,7820
మెజార్టీ : 56,650

114. మధిర (ఎస్సీ)

అభ్యర్థి : భట్టి విక్రమార్క
సమీప అభ్యర్థి : లింగాల కమల్‌రాజ్
పోలైన ఓట్లు : 1,96,419
వచ్చిన ఓట్లు : 1,08,970
మెజార్టీ : 35,452

115. వైరా (ఎస్టీ)

అభ్యర్థి : రాందాస్ నాయక్
సమీప అభ్యర్థి : మదన్‌లాల్
పోలైన ఓట్లు : 1,69,457
వచ్చిన ఓట్లు : 93,913
మెజార్టీ : 33,050

116.సత్తుపల్లి (ఎస్సీ)

అభ్యర్థి : మట్టా రాగమయి
సమీప అభ్యర్థి : వెంకటవీరయ్య
పోలైన ఓట్లు : 2,12,605
వచ్చిన ఓట్లు : 1,09,449
మెజార్టీ : 18,475

117. కొత్తగూడెం


అభ్యర్థి : సాంబశివరావు
సమీప అభ్యర్థి : జలగం వెంకట్రావ్
పోలైన ఓట్లు : 18,6347
వచ్చిన ఓట్లు : 79,155
మెజార్టీ : 26,184

118. అశ్వరావ్‌పేట (ఎస్టీ)

అభ్యర్థి : ఆదినారాయణ
సమీప అభ్యర్థి : మెచ్చా నాగేశ్వరరావు
పోలైన ఓట్లు : 1,35,497
వచ్చిన ఓట్లు : 74,420
మెజార్టీ : 28,457

119. భద్రాచలం (ఎస్టీ)

అభ్యర్థి : తెల్లం వెంకట్రావు
సమీప అభ్యర్థి : వీరయ్య
పోలైన ఓట్లు : 1,17,447
వచ్చిన ఓట్లు : 52,912
మెజార్టీ : 5,755



బీఆర్ఎస్‌కు నిరుద్యోగుల వాత

ఎన్నికల్లో హామీ ఇచ్చినా అమలు కాని 'భృతి'

- ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం
- టీఎస్‌పీఎస్సీ తీరుపై అసంతృప్తి
- ప్రశ్నాపత్రాల లీకేజీతో ఇబ్బందులు
- కాంగ్రెస్‌వైపు మొగ్గిన యువత

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'ఒక్కొక్కరికీ నెలకు రూ.3,016 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తాం.'అంటూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ పార్టీ మ్యానిఫెస్టోలోనూ ప్రకటించారు. ఎన్నికల్లో మామీ ఇచ్చినా ఐదేండ్లలోనూ నిరుద్యోగ భృతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో నిరుద్యోగుల్లో ఈ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే ఈ ఎన్నికల సందర్భంగానైనా నిరుద్యోగుల కోసం బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఏదో ఒక హామీ ఇస్తారని ఆశించారు. కానీ అందులోనూ వారి ఊసే ఎత్తలేదు. నిరుద్యోగులు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలనే ప్రస్తావించలేదు. దీంతో బీఆర్ఎస్ తీరు పట్ల నిరుద్యోగులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మోసం చేసిందన్న అభిప్రాయానికి వచ్చారు. అదును కోసం ఎదురుచూసిన నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకున్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలిచి బీఆర్ఎస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ గెలిచిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్‌ను ఓడించాలంటూ ఓయూ జేఏసీ నేతలు, యువజన సంఘాలు గ్రామగ్రామాన తిరిగి


(ఫైల్)

ప్రచారం చేశాయి. జాగో తెలంగాణ పేరుతో నిరుద్యోగ చైతన్య బస్సుయాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బు, మద్యానికి ఓటు వేస్తే తమ జీవితాలు ఆగమవుతున్నాయని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇది ప్రజలను ఆలోచింపచేసింది. అందుకే అటు నిరుద్యోగులు, ఇటు ఉద్యోగులు, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు సైతం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేశారు. అందుకే అధికార పార్టీ ఓటమిని చవిచూసింది.

కొలువులు రాక మానసిక వేదన

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదం పేరుతో తెలంగాణ ఉద్యమం సాగింది. ప్రత్యేక రాష్ట్రం వస్తే అందరికీ ఉద్యోగాలు వస్తాయని యువకులు ఆ ఉద్యమంల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎంతో మంది ఆత్మబలిదానాలు చేశారు. తెలంగాణ వచ్చినా బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయమే తెలంగాణలోనూ జరిగిందన్న అభిప్రాయానికి నిరుద్యోగులొచ్చారు. ఇంకోవైపు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వ్యవహరించిన తీరు నిరుద్యోగుల్లో ఆగ్రహానికి కారణంగా ఉన్నది. ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు రద్దు కావడం, వాయిదా పడడం వంటి కారణాలతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా మొదటిసారి, హైకోర్టు ఆదేశాలతో రెండోసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను కూడా టీఎస్‌పీఎస్సీ, ఎన్నికల కారణంగా డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేశాయి. దీంతో జీవితాలు నాశనమయ్యాయన్న అభిప్రాయానికి నిరుద్యోగులు బలంగా వచ్చారు. ఒకవైపు విలువైన సమయం, ఇంకోవైపు డబ్బు వృధా అయ్యాయన్న మానసిక ఆవేదనకు వచ్చారు. ఎన్నికల్లో నిరుద్యోగుల అంశం కీలకంగా పనిచేసింది. అధికారంలోకి వస్తే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ప్రకటించారు. ఇంకోవైపు పరీక్షలు వాయిదా పడడంతో మనస్థాపానికి గురైన ప్రవళిక ఆత్మహత్య సంచలనమైంది. ప్రేమకారణంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదంటూ మంత్రి కేటీఆర్ ప్రకటించి అభాసుపాలయ్యారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చింది. అందుకే నిరుద్యోగులు ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపులో కీలక భూమిక పోషించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గం నుంచి పోటీచేసిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విషయం తెలిసిందే.ఆయనకు 44,646 ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలో బీఎస్పీ అభ్యర్థులకు మొత్తం 3,21,048(1.37 శాతం) ఓట్లు రావటం విశేషం. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తన ప్రచారానికి ఎన్ని ఆటంకాలు సృష్టించినా..బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకుపోవటం వల్లనే ఆ మాత్రం ఓట్లు వచ్చాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.మరో పక్క డబ్బు, మద్యంతోపాటు ప్రభుత్వ యంత్రాంగం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కదిలికలపై కేంద్రీకరించి స్వేచ్ఛగా ప్రజలను కలవకుండా చేశారని వారు ఆరోపిస్తున్నారు.

8 స్థానాల్లో బీజేపీ గెలుపు

- 68 నియోజకవర్గాల్లో డిపాజిట్ గల్లంతు
- ప్రభావం చూపని జనసేన..ఆదరించని సెటిలర్లు
- కూకట్‌పల్లిలో మినహా మిగతా చోట్ల 4వేల లోపే
- అన్నిచోట్లా డిపాజిట్ గల్లంతు
- గెలుస్తారనుకున్నోళ్ల ఓటమి..అంచనా లేనోళ్ల గెలుపు
- కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి గెలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది స్థానాల్లో గెలుపొందింది. రాష్ట్రంలో 20కిపైగా సీట్లు వస్తాయనీ, తద్వారా కింగ్‌మేకర్ పాత్ర పోషించాలనే ఆశ ఆదిలోనే ఆవిరైంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఊహించిందేమీ జరగలేదు. బెంగాల్‌లో మమతాబెనర్జీపై సువేందు సర్కారును ప్రయోగించినట్టే ఇక్కడ సీఎం కేసీఆర్‌పై ఈటలను బీజేపీ ఎక్కుపెట్టింది. కానీ, అది బూమరాంగ్ అయింది. సీఎం కేసీఆర్ చేతిలో 45031 ఓట్ల భారీ తేడాతో ఈటల ఓటమి చవిచూశారు. తన సొంత నియోజకవర్గమైన హుజురాబాద్‌లో తగిన ప్రచారం చేసుకోకపోవడంతో ఆయన అక్కడా 16 వేల పైచిలుకు ఓట్లతో పరాజయం పాలయ్యారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి కృష్ణయాదవ్ ఓడిపోయారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లో గట్టెక్కలేకపోయారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అధిష్టానం వద్ద పట్టుబట్టిమరీ తన అనుచరుడు పూసరాజుకు ముషీరాబాద్ సీటును ఇప్పించుకున్నాడు. కానీ, గెలిపించుకోలేకపోయాడు. అధిష్టానం విజయం సాధిస్తారని భావించిన నేతలంతా ఓడిపోయారు. ఊహించని నేతలు గెలిచారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను, టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డిలను వెనక్కి తోచి బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి సంచలన విజయం సాధించారు. బీజేపీ గెలిచిన ఎనిమిది స్థానాల్లో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే నాలుగున్నాయి. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టి రెండేండ్లుగా ఆ పార్టీ పనిచేసినప్పటికీ ఆ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేదు. ఎస్సీ వర్గీకరణను చూపెట్టి మందకృష్ణ మాదిగతో విశ్వరూపసభ పెట్టించి దళితుల ఓట్లు పొందాలనే ఆశ నెరవేరలేదు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో కమలం పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తామే ప్రత్యామ్నాయం అని ప్రచారం చేసిన ఆ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మలేదు. బీసీని సీఎం చేస్తామన్న మాటల్ని విశ్వసించలేదు. మొత్తం 68 స్థానాల్లో ఆ పార్టీ డిపాజిట్లను కోల్పోయింది. అమిత్‌షా 11 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా ఎక్కడ కూడా గెలవలేదు. మోడీ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో రెండు చోట్లనే (కామారెడ్డి, నిర్మల్)లో విజయం సాధించింది. యోగి ఆదిత్యనాథ్ 8 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. అందులో సిర్పూర్, గోషామహల్ స్థానాల్లోనే గెలిచింది. నడ్డా ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఆ పార్టీకి డిపాజిట్ దక్కలేదు. కేంద్ర మంత్రులు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇతర రాష్ట్రాల నేతలు ప్రచారం చేసిన చోట ఆ పార్టీకి ఆశించిన ఓట్లు రాలలేదు. రాష్ట్రంలో మొత్తం 111 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 68 నియోజకవర్గాల్లో డిపాజిట్లను కోల్పోయింది. అయితే, బీజేపీ బలం గత ఎన్నికలతో పోలిస్తే పెరిగింది. 2018 ముందస్తు ఎన్నికల్లో 7.1 శాతం ఓట్లను పొందిన ఆ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో 13.90 శాతం ఓట్ల సాధించి మూడోస్థానంలో నిలిచింది. జనసేనతో పొత్తు పెట్టుకుని ఏపీ సెటిలర్ల ఓట్లు దక్కించుకోవాలనే ఎత్తుగడ పారలేదు. పైగా, జనసేనకు కేటాయించిన సీట్లలో ఎక్కడ కూడా డిపాజిట్ దక్కలేదు. ఒక్క కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే ఆ పార్టీ అభ్యర్థి అత్యధికంగా 39711 ఓట్లు సాధించారు. మిగతా ఏడు నియోజకవర్గాల్లో 4080 ఓట్లను మించలేదు.

నోటాకు 1,71,885 ఓట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నన్ ఆఫ్ ది ఎబో (నోటా) కు 1,71,885 ఓట్లు పోలయ్యాయి. పోటీ చేసిన అభ్యర్థుల్లో తమకు ఎవరు నచ్చని సందర్భంలో నోటాకు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజక వర్గాల్లో అత్యధికంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 4,079 ఓట్లు నోటాకు పోల్ కాగా, అత్యల్పంగా ఆలేరు నియోజకవర్గంలో 73 ఓట్లు మాత్రమే పోల్ అయినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. 500 ఓట్ల లోపు ఆదిలాబాద్, హుస్నాబాద్‌లలో నోటాకు ఓట్లు పోల్ కాగా శేరిలింగంపల్లి, వర్ధన్నపేట, మేడ్చల్ నోయోజకవర్గాల్లో మూడు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. రెండు వేలకు పైగా ఉప్పల్, సిర్పూర్, పటాన్‌చెరు, పాలకుర్తి, నిజామాబాద్ రూరల్, అచ్చంపేట, ఆలంపూర్, బెల్లంపల్లి, బోథ్, ధర్మపురి, దుబ్బాక, ఖానాపూర్, కొండంగల్, కూకట్ పల్లి, ఎల్బీనగర్, మహేశ్వరం, మల్కాజిగిరి,మొత్తం 17 స్థానాల్లో నోటాకు రెండు వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

సాగర్ వద్ద హైడ్రామాకు తెర

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్‌పై నాలుగు రోజుల హైడ్రామాకు తెరపడింది. డ్యాంను సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. డ్యాంపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా వేసిన కంచెను, భారీకేడ్లను ఆదివారం ఉదయం తొలగించారు. ప్రాజెక్ట్ పర్యవేక్షణ బాధ్యతలను కృష్ణా బోర్డు, కేంద్ర బలగాలకు అప్పగించడం, దానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అంగీకరించిన నేపథ్యంలో డ్యామ్‌ను స్వాధీనం చేసుకున్నాయి. కుడి కాలువకు నీటి విడుదల కూడా బంద్ చేశారు.

వారసులు.. కుటుంబ సభ్యులు..

ఎన్నికల్లో గెలుపోటములు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనున్నది. అయితే ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి (అన్నా, తమ్ముళ్లు, మామా అల్లుళ్లు ,, భార్యా భర్తలు)పలువురు బరిలో నిలవగా కొందరు ఓటమి, మరికొందరిని గెలుపు వరించింది.

కోమటిరెడ్డి బ్రదర్స్..

అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఘన విజయం సాధించారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ తరపున వీరు పోటీ చేశారు.మునుగోడులో రాజగోపాల్ రెడ్డి 21వేల మెజార్టీతో గెలుపొందగా, ఆయన అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండలో 54వేలకు పైగా మెజార్టీతో భారీ విజయాన్ని అందుకున్నారు.

గడ్డం సోదరులు..

గడ్డం వినోద్, గడ్డం వివేక్ విజయం సాధించారు. వినోద్ బెల్లంపల్లి నియోజక వర్గం నుంచి ఆయన సోదరుడు వివేక్ చెన్నూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున బరిలో దిగారు. ఇద్దరూ విజయం సాధించటం గమనార్హం.

భార్యాభర్తలు..

ఎన్నికల్లో భార్యభర్తలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పద్మావతి రెడ్డి భారీ విజయాన్ని అందుకున్నారు. హుజూర్‌నగర్‌నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ నుంచి పోటీలో నిలిచిన ఆయన భార్య పద్మావతిరెడ్డి ఘన విజయం సాధించారు.

మామా అల్లుళ్లు..

మేడ్చల్ నియోజక వర్గం నుంచి మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరిలో ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు.

కేసీఆర్..కేటీఆర్..

తండ్రికొడుకులు సీఎం కేసీఆర్, కేటీఆర్ పోటీలో ఈ సారి కూడా ఉన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీ చేయగా కామారెడ్డిలో ఓటమి చవిచూశారు. గజ్వేల్‌లో గెలుపొందారు. కుమారుడు కేటీఆర్ సిరిసిల్లలో బరిలో దిగారు. భారీ మెజారిటీతో గెలుపొందారు.

మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ కాంగ్రెస్ తరపున బరిలోకి దిగారు.

మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన రోహిత్ గెలుపొందగా, మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసిన మైనంపల్లి హనుమంతరావు ఓటమి పాలయ్యారు.

ఓడిన బంధువులు..

వరంగల్ తూర్పు అసెంబ్లీ స్థానం నుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్ బీజేపీ తరపున పోటీలో నిలిచారు. ఆయన సోదరుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచారు. ఇద్దరూ ఓటమి పాలయ్యారు.

అత్త..అల్లుడు..

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున బాల్కొండ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో ఉండగా..ఆయన మేనత్త అన్నపూర్ణమ్మ బీజేపీ తరపున బరిలో నిలిచారు. చివరకు వేముల ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించారు.